





వంశీ ఆగడాలపై ఫిర్యాదుల వెల్లువ

- పది సెంట్ల స్థలం ఆక్రమించుకున్నారని మహిళ ఆవేదన
- పానకాల చెరువులో అక్రమ మైనింగ్ చేశారని రైతుల ఆగ్రహం
- ఆన్‌లైన్ చేయిస్తామని పొలం కాజేశారని ఆరోపణ

6లో



8లో

అపవిత్రం

దుర్గాఘాట్‌లో లోపించిన పరిశుభ్రత

నదిలో కలుస్తున్న మరుగుదొడ్ల వ్యర్థ నీరు

పట్టించుకోని ఆలయ అధికారులు • ఆగ్రహం వ్యక్తం చేస్తున్న భక్తులు

శివోహం

నేడు మహాశివరాత్రి పర్వదినం

శైవక్షేత్రాల్లో విస్తృతంగా ఏర్పాట్లు

మహాశివరాత్రిని పురస్కరించుకుని యనమలకుదురులోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానం విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా వెలుగొందుతోంది. మంగళవారం అర్ధరాత్రి తర్వాత ప్రారంభమైన స్వామి వారి దర్శనానికి మూడు గంటల ముందే భక్తులు క్యూ లైన్లలో బారులుతీరారు. శివనామస్మరణతో ఆలయం మార్మోగింది. అధికారులు, ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇంద్రకీలాద్రిపై ఉన్న మల్లేశ్వరస్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో విశేషంగా అలంకరించారు.

-ఆంధ్రజ్యోతి-పెనమలూరు/వన్‌టౌన్

తప్పులతడక

ఈ-గ్రామస్వరాజ్య పోర్టల్‌లో సాంకేతిక లోపాలు

- గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక వివరాల నమోదుకు ప్రభుత్వం ఆదేశం
- ఈ ఏడాది జనవరి 31నాటికి పూర్తి చేయాలని ఉత్తర్వులు
- పీఆర్ వన్‌యాప్‌లోని వివరాలు నమోదు చేస్తుంటే మారిపోతున్న విభాగాలు
- ఇబ్బందులు పడుతున్న సిబ్బంది.. సమస్య పరిష్కరించాలని అధికారులకు వినతి

గ్రామ పంచాయతీల్లో ఆర్థికపరమైన అంచనాలు తయారు చేసేందుకు ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఈ-గ్రామస్వరాజ్య పోర్టల్ ఇక్కట్లపాల్జేస్తోంది. గతంలో ఉన్న గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక(పీఆర్ వన్‌యాప్)లో కొద్దిపాటి మార్పులు చేసి ఈ పోర్టల్‌లో వివరాలు నమోదు చేస్తుంటే తీసుకోవడంలేదు. ఏ పద్దుకు, ఎంత నిధులు కేటాయించాలనే అంశంపై వివరాలు నమోదు చేస్తుంటే అన్ని వివరాలు పారిశుధ్యానికి సంబంధించిన కాలమ్‌లోకి వెళ్లి పోతున్నాయి. ఈ పోర్టల్ తప్పులతడకగా ఉందని, సరిచేయాలని పంచాయతీ కార్యదర్శులు ఉన్నతాధికారులకు మొరపెట్టుకుంటున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఏటా గ్రామపంచాయతీలకు వచ్చే ఆదాయ వనరులను దృష్టిలో పెట్టుకుని గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికను తయారు చేస్తారు. పంచాయతీల్లో ఇంటి పన్నులు, చెరువులు, పచ్చగడ్డి వేలం పాటలు, కాలువల్లో వలకట్ల రూపంలో వచ్చే ఆదాయం, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే 15వ ఆర్థిక సంఘం నిధులు, షాపింగ్ కాంప్లెక్స్‌లపై వచ్చే అద్దె తదితర ఆదాయ మార్గాలను అనుసరించి పంచాయతీల్లో ఆయా విభాగాలకు 10 నుంచి 15శాతం అదనంగా కేటాయింపులు పెంచి గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికను రూపొందిస్తారు. ఈ ఏడాది గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించి.. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఈ-గ్రామ స్వరాజ్య పోర్టల్‌లో ఈ వివరాలను నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో పంచాయతీల్లో చేపట్టే పనులు, నిధుల కేటాయింపుపై ప్రత్యేక ప్రణాళికను తయారు చేసేందుకు షెడ్యూలును పంచాయతీరాజ్

మిగతా 6లో..



పంచాయతీ కార్యాలయం

నమోదులో ఇబ్బందులు

గ్రామ పంచాయతీల్లో రూపొందించిన అంచనాలను ఈ-గ్రామ స్వరాజ్య పోర్టల్‌లో నమోదు చేసేందుకు పంచాయతీల్లో పనిచేసే సాంకేతిక సిబ్బంది ప్రయత్నిస్తుంటే అన్నీ తప్పుల తడకలుగా ఉండి సక్రమంగా నమోదు కావడంలేదు. ఉదాహరణకు పంచాయతీలకు వచ్చే ఆదాయంలో 30శాతం నిధులను సిబ్బంది జీతభత్యాలకు కేటాయిస్తారు. 15శాతం నిధులను తాగునీటి అవసరాల కోసం, 15శాతం నిధులను రహదారుల అభివృద్ధికి, 10శాతం నిధులను విద్యుత్ బిల్లులకు, కార్యాలయాల నిర్వహణ, ఇంటర్‌నెట్ వాడకం, స్థానికంగా ఉన్న ఇతరత్రా అవసరాల మేరకు కేటాయింపుల చేస్తారు. పీఆర్ వన్‌యాప్‌లోని వివరాలను ఈ-గ్రామ స్వరాజ్య పోర్టల్‌లో ఇచ్చిన ఫార్మట్‌లో నమోదు చేస్తుంటే అన్నీ పారిశుద్ధ్యం విభాగం కాలమ్‌లో నమోదు అవుతున్నాయి. దీంతో ఈ ప్రక్రియ జనవరి 31వ తేదీ నుంచి నిలిచిపోయింది.

ప్రచారానికి తెర

ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

- రేపే కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల పోలింగ్
- ప్రధాన పోటీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, కేఎస్ లక్ష్మణరావు మధ్యే
- విద్యావేత్త, విద్యాదాతల్లో విజయం ఎవర్ని వరించేనో..
- కూటమి బలం, ప్రజా సంఘాల మద్దతు ఆధారంగా సమరం



ఆలపాటి రాజేంద్రప్రసాద్



కేఎస్ లక్ష్మణరావు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి తెరపడింది. మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ప్రచారం ముగిసింది. కూటమి బలపర్చిన అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్, పీడీఎఫ్ బలపర్చిన అభ్యర్థిగా కేఎస్ లక్ష్మణరావు మధ్య ప్రధానంగా పోటీ జరగనుంది. ప్రధాన అభ్యర్థులు గత పక్షం రోజులుగా ఆత్మీయ సమ్మేళనాలు, ఆత్మీయ సమావేశాల పేరుతో పతాక స్థాయిలో ప్రచారాన్ని నిర్వహించారు. ఆలపాటి విజయాన్ని కాంక్షిస్తూ మండల, డివిజన్, నియోజకవర్గాల స్థాయిలో ఆత్మీయ సమ్మేళనాలు జరిగాయి. కేఎస్ లక్ష్మణరావు కూడా ప్రజా సంఘాలతో కలిసి క్షేత్రస్థాయిలో సుడిగాలి పర్యటనలు చేశారు. ప్రధాన అభ్యర్థుల

మిగతా 6లో..

ఇద్దరి ఉసురు తీసిన అతివేగం

కంచికచర్ల మండలంలో డివైడర్‌ను ఢీకొన్న బైక్

ఇద్దరు యువకులు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు



ఇమ్రాన్



కరిముల్లా

కంచికచర్ల రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్‌జిల్లా కంచికచర్ల మండల పరిధిలోని ఎస్.ఎస్.పీ కెనాల్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందగా, మరో యువకుడు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే... ఉయ్యూరు చెందిన ఫరీద్ బేగ్ హైదరాబాద్‌లో ఉంటున్నారు. తన బంధువు మృతి చెందడంతో బైక్‌పై హైదరాబాద్ నుంచి సోమవారం రాత్రి స్నేహితులతో కలిసి ఉయ్యూరుకు ప్రయాణం అయ్యారు. నిద్రమత్తులో అతివేగంగా వెళ్తూ డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో రంగారెడ్డి జిల్లా చింతల్‌మేట్‌కు చెందిన అబ్దుల్ ఇమ్రాన్ (25), కృష్ణాజిల్లా కృత్తివెన్ను మండలం చిన్నపాండ్రిక గ్రామానికి చెందిన హుస్సేన్ కరిముల్లా మృతి చెందారు. ఫరీద్ బేగ్ తీవ్రంగా గాయపడటంతో అతడ్ని నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇద్దరు యువకులు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వారి కుటుంబాలకు వీరే ఆధారం కావడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



ఈవీఎం గోదాము తనిఖీ చేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ఈవీఎంలకు పటిష్ట భద్రత

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఈవీఎం, వీవీప్యాట్‌ల భద్రతపై పోలీస్ సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా వుండాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా గొల్లపూడిలోని ఈవీఎం, వీవీప్యాట్ గోదామును అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి మంగళవారం పరిశీలించారు. సీసీ కెమేరాల పనితీరు, అగ్నిమాపక శాఖ పరికరాలు తదితరాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎం, వీవీప్యాట్‌లు భద్రపరిచిన గోదామును ఎప్పటికప్పుడు తనిఖీ చేసి సమగ్ర నివేదికను సమర్పిస్తున్నట్టు వెల్లడించారు. గోదాము వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా వుంటూ సీసీ కెమేరాల పర్యవేక్షణతో గట్టి నిఘా వుంచాలన్నారు. కలెక్టర్ వెంట డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సిబ్బంది తదితరులున్నారు.

పెండింగ్ పదోన్నతులకు అనుమతివ్వండి

» లేకుంటే మార్చిలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమం

» ఆర్టీసీ ఎండీకి యూనియర్ రాష్ట్ర నేతల లేఖ

బస్‌స్టేషన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో పెండింగ్‌లో ఉన్న సుమారు మూడువేల పదోన్నతులకు ప్రభుత్వం నుంచి అనుమతులు రాకపోతే మార్చి నెలలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని ప్రజారవాణా సంస్థ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్యలు మంగళవారం ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు లేఖ అందజేశారు. అర్హతలు ఉండి కూడా పదోన్నతులు పొందకుండా చాలామంది పదవీ విరమణలు చేశారన్నారు. 30 సంవత్సరాల పైబడి సర్వీసు ఉన్న సీనియర్ ఉద్యోగులు ఆరేళ్లుగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తూనే ఉన్నారన్నారు. జూనియర్ స్కేల్ ఆఫీసర్ల నుంచి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల వరకు సుమారు 60మంది రాష్ట్రంలో ఇన్‌చార్జ్‌లుగా విధులు నిర్వహిస్తున్నా సమస్యలను పరిష్కరించకుండా వదిలేస్తున్నారన్నారు. పదోన్నతులపై ప్రభుత్వ పెద్దలు, సంబంధిత మంత్రి చొరవ తీసుకుని పరిష్కరించాలన్నారు. అలాగే ప్రభుత్వశాఖల్లో పనిచేసే మహిళా ఉద్యోగులకు మార్చి 8న మహిళా దినోత్సవం సందర్భంగా విధుల్లో వెసులుబాటు కల్పించటంతో పాటు స్పెషల్ క్యాజువల్ లీవ్‌ను మంజూరు చేయాలన్నారు. అన్ని డిపో యూనిట్లు, జిల్లా కేంద్రాలలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించాలన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర, పక్కన మంత్రి సుభాష్, కొనకళ్ల తదితరులు

రాజ్యాంగంపై గౌరవం లేని జగన్‌కు ప్రతిపక్ష హోదా ఎందుకు : రవీంద్ర

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : గవర్నర్, రాజ్యాంగ వ్యవస్థలపై గౌరవంలేని జగన్‌కు అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా ఎందుకని మంత్రి కొల్లు రవీంద్ర ప్రశ్నించారు. కూటమి బలపర్చిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ తోట్లవల్లూరు టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆత్మీయ సమావేశం జరిగింది. సమావేశంలో మంత్రి రవీంద్ర మాట్లాడుతూ, హత్యలు, అత్యాచారాలు, లూటీలు చేసే దొంగలను నాడు జగన్ ఎమ్మెల్సీలుగా చేస్తే నేడు సీఎం చంద్రబాబు ఎంతో గౌరవప్రదమైన ఆలపాటిని ఎమ్మెల్సీగా పోటీ చేయిస్తున్నారని, అలాంటి మంచి వ్యక్తిని అఖండ మెజార్టీతో గెలిపించి కూటమి ప్రభుత్వానికి నైతిక బలం చేకూర్చాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. ఏప్రిల్‌లో కాల్వల మరమ్మతులకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, జూన్‌లో తల్లికి వందనం ద్వారా రూ.15వేలు ఇచ్చేందుకు సీఎం నిర్ణయం తీసుకున్నారని రవీంద్ర తెలిపారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ, ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను 93 శాతం ఓట్లతో ఎమ్మెల్సీగా గెలిపించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మొదటి ప్రాధాన్యత ఓటును ఆలపాటికి ఎలా వేయాలని, బ్యాలెట్ పేపర్ ఎలా ఉంచాలి తదితర అంశాలను ఓటర్లకు వివరించి బూత్ లోపలికి పంపాలని సూచించారు. వైసీపీ పాలనలో గాడితప్పిన రాష్ట్రాన్ని చంద్రబాబు అభివృద్ధి పథంలో పయనింపచేస్తున్నారన్న విషయాలను ఓటర్లకు వివరించాలని మంత్రి తెలిపారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, ఆలపాటిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని పేర్కొన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నీలాయపాలెం విజయకుమార్, వీరంకి వెంకట గురుమూర్తి, గన్నే వెంకట నారాయణ ప్రసాద్(హన్నా), సురేంద్ర, ఎస్.కృష్ణసుమన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఆటంకాలు రానీయొద్దు

» మహా శివరాత్రికి పకడ్బందీగా ఏర్పాట్లు

» నిరంతరం అధికారుల పర్యవేక్షణ ఉండాలి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాలు

కలెక్టరేట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి, దుర్గామల్లేశ్వర స్వామిని దర్శించుకోనున్న నేపథ్యంలో ఆలయ పరిసర ప్రాంతాల్లో పటిష్ట ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. మంగళవారం దేవస్థానం అధికారులతో పాటు రెవెన్యూ, పోలీస్, వీఎంసీ, మత్స్య, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులకు ఏర్పాట్లపై మార్గనిర్దేశనం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఘాట్ల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసుశాఖ బందోబస్తు చేసినట్టు చెప్పారు. నిరంతర గస్తీతో పాటు క్యూలైన్లు, బ్యారికేడింగ్ పైనా ప్రత్యేకంగా దృష్టిసారించి, పోలీస్ పికెట్‌తో పాటు సూచిక బోర్డులు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. ఘాట్ల వద్ద జల్లు స్నానాలు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు వసతులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తాగునీరు, మొబైల్ టాయిలెట్లు, నిరంతర పారిశుధ్యం ఏర్పాట్లు వుంటాయన్నారు. వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలతో పాటు అవసరమైన మందులు అందుబాటులో వుంటాయన్నారు. ఘాట్‌ల వద్ద నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

సుశిక్షితులైన గజ ఈతగాళ్లు అందుబాటులో వుంటారని తెలిపారు. గొల్లపూడి, సూరాయపాలెం, పవిత్ర సంగమం వద్ద ఎలాంటి ఇబ్బంది లేకుండా భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించేందుకు సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, అధికారులకు ఇప్పటికే ఆదేశాలిచ్చినట్టు కలెక్టర్ తెలిపారు.

ఆలయాల వద్ద పటిష్ట బందోబస్తు : సీపీ

గుణదల : మహా శివరాత్రిని పురస్కరించుకుని కృష్ణా స్నానఘాట్ల వద్ద, అలాగే యనమలకుదురు శివాలయం వద్ద భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్టు నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్‌బాబు తెలిపారు. పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు భారీగా తరలిరానున్న నేపథ్యంలో కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఎప్పటికప్పుడు వాహనాల రద్దీని పరిశీలించాలని చెప్పారు. కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద సిబ్బంది, పోలీసు అధికారులకు ట్రాఫిక్ నియంత్రణపై దిశా నిర్దేశం చేశారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం కృష్ణా ఎస్పీ ఆర్.గంగాధర్‌తో కలిసి యనమలకుదురు వద్ద బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు రద్దీని పరిశీలించాలని సూచించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో డీసీపీలు గౌతమి షాలి, కృష్ణమూర్తి నాయుడు, ఏడీసీపీ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కమాండ్ కంట్రోల్ రూమ్ బందోబస్తు పర్యవేక్షణను అధికారులకు వివరిస్తున్న సీపీ రాజశేఖర్‌బాబు

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

» పోలింగ్ జరిగే ప్రాంతాల్లో రెండు రోజుల పాటు విద్యాసంస్థలకు సెలవు

» 42 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

» కృష్ణా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్టు కలెక్టర్ బాలాజీ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 27వ తేదీ ఉదయం 8గంటలనుంచి సాయంత్రం 4గంటలవరకు ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ జరుగుతుందన్నారు. జిల్లాలో 63,114 మంది ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. పోలింగ్ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 48గంటలపాటు 144సెక్షన్‌ను అమలులో ఉంటుందన్నారు. 31ప్రాంతాల్లో 77పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, 477మంది అధికారులు, సిబ్బందిని కేటాయించామని తెలిపారు. వీరిలో 94మంది పీవోలు, 92మంది ఏపీవోలు, 199మంది ఓపీవోలు, 92మంది మైక్రో అబ్జర్వర్లు ఉన్నట్టు తెలిపారు. మార్చి 3న గుంటూరులో ఓట్లలెక్కింపు ప్రక్రియ ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 42సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి, అక్కడ పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశామని తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

నేడు మెటీరియల్ అందజేత

ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని మచిలీపట్నం నోబుల్‌కళాశాలలో, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవో కార్యాలయాలవద్దఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల వద్ద పోలింగ్ మెటిరియల్‌ను బుధవారం అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ ముగిసిన తరువాత రిసెప్షన్ కేంద్రాలవద్ద పోలింగ్ సిబ్బంది నుంచి మెటిరియల్‌ను స్వీకరిస్తారని తెలిపారు. ఇందుకోసం పూర్తిస్థాయిలో వాహనాలను అందుబాటులో ఉంచామన్నారు. పోలింగ్ కేంద్రాలవద్ద పటిష్ట పోలీస్‌బందోబస్తును ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. పోలింగ్ కేంద్రాలలోకి పోలింగ్ ఏజెంట్లు, సిబ్బంది సెల్‌ఫోన్‌లను తమవెంట తీసుకుని వెళ్లకూడదన్నారు. పోలింగ్ జరిగే 77 పోలింగ్ కేంద్రాలలో ఉన్న పాఠశాలలకు 26, 27తేదీలలో సెలవు ప్రకటించామన్నారు. ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునే సమయంలో 1, 2, 3అంకెలను సూచిస్తూ ప్రాధాన్యతాక్రమంలో అంకెలు వేయాలన్నారు. ఓటర్లుగా ఉన్న కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్ర ఎన్నికల సంఘం 27 తేదీన స్పెషల్ క్యాజువల్ లీవ్‌గా ప్రకటించిందని కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలు సక్రమంగా జరిగేలా రాజకీయపార్టీల నాయకులు సహకరించాలని రాజకీయపార్టీల నాయకులతో కలెక్టర్ కోరారు. డీఆర్వో కె.చంద్రశేఖరరావు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

తెలంగాణ టాపర్‌గా విజయవాడ యువతి

» వైద్య విద్యలో డాక్టర్ జాహ్నవికి ఫస్ట్ ర్యాంక్



పాయకాపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది జనవరిలో తెలంగాణా ప్రభుత్వం నిర్వహించిన మూడో సంవత్సరం మెడికల్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ (ఎంఎస్ ఓబీజీ) పరీక్షల్లో విజయవాడకు చెందిన యువతి డాక్టర్ అయినపురి జాహ్నవి స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించింది. గాంధీజీ మెడికల్ కాలేజీలో పీజీ చేస్తున్న జాహ్నవి 78.75 శాతంతో తెలంగాణ టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా డాక్టర్ జాహ్నవిని పలువురు అభినందించారు.

రేపు ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ లీవ్

కలెక్టరేట్ : కృష్ణా-గుంటూరు జిల్లాల శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఓటుహక్కు వినియోగించుకొనేందుకు ప్రభుత్వ ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ లీవ్‌ను భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రకటించినట్టు కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు, వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక, ఇతర సంస్థలు తమ ఉద్యోగులు, కార్మికులు ఓటు హక్కును వినియోగించుకొనేందుకు విధుల సమయాన్ని తగ్గించడం లేదా షిఫ్టుల వెసులుబాటు కల్పించాలని కలెక్టర్ సూచించారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు కృష్ణాజిల్లా అధికారి సాల్మన్‌రాజు పేర్కొన్నారు. జిల్లాలో 63 పరీక్షా కేంద్రాల్లో 45,530 మంది పరీక్షలకు హాజరు కానుండగా.. మొదటి సంవత్సరం 24,557 మంది, రెండో సంవత్సరం 20,873 మంది పరీక్ష రాయనున్నారు. జిల్లాను 14 జోన్‌లుగా విభజించి 63 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 63మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 600మంది ఇన్విజిలేటర్లను నియమించారు. జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో పదిపరీక్షా కేంద్రాల్లో 3151మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. మార్చి 1 నుంచి 15 వరకు పరీక్షలు జరగనున్నాయి.

వంశీ ఆగడాలపై ఫిర్యాదుల వెల్లువ

గన్నవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం పట్టణంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న తన పది సెంట్ల ఖాళీ స్థలాన్ని మాజీ ఎమ్మెల్యే వంశీ ప్రోద్బలంతో అతడి అనుచరులు రాయించుకున్నారని విజయవాడకు చెందిన సుంకర సీతామహాలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుంకర సీతామహాలక్ష్మి పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్ సమీపంలో 2004లో పదిసెంట్ల ఖాళీ స్థలాన్ని రూ.4,11,500లకు బొప్పన చౌడేశ్వరి నుంచి అగ్రిమెంట్ ఆఫ్ సేల్ కం జనరల్ పవర్ ఆఫ్ అటర్నిడీడ్‌గా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. రిజిస్ట్రేషన్ అనంతరం స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. అదే ఏడాది 30న చౌడేశ్వరి చెల్లెలు మూల్పూరి విజయ తులసి రాణి, చల్లపల్లి జయశ్రీలు సదరు స్థలం వారి స్వాధీనంలో ఉందని ఆపై, తనకు అమ్మిన చౌడేశ్వరిపై ఇంజక్షన్ దావా వేశారు. దీనిపై గుడివాడ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు స్టాటస్‌కో ఇచ్చారు. 2010లో చౌడేశ్వరి గన్నవరం రిజిస్ట్రార్ కార్యాలయంలో సేల్‌డీడ్ దస్తావేజును రాసి సీతామహాలక్ష్మికి ఇచ్చారు. దావా కొనసాగుతున్న తరుణంలో 2019లో రెండోసారి వంశీని తులసిరాణి, జయశ్రీలు ఆశ్రయించారు. 2021లో వంశీ తనను పిలవగా తన భర్త కృష్ణమూర్తి, దేవిరెడ్డి రవీందర్‌రెడ్డి, సుబ్బరాజులతో కలిసి వెళ్లారు. అక్కడ వంశీ చౌడేశ్వరీ వద్ద కొన్న స్థలంను ఆ రేటుకు అమ్మమని డిమాండ్ చేయగా అందుకు నిరాకరించారు. వంశీ ఆఫీస్‌లో ఉన్న బీబీగూడెంకు చెందిన నల్లబాబు, రంగా, ఎంపీపీ అనగాని రవిలతో నువ్వు ఎలా ఆ స్థలంలోకి వెళతావో చూస్తామని, నిన్ను చంపైనా ఆ స్థలం ఆక్రమించుకుంటామని బెదిరించారని ఫిర్యాదులో సీతామహాలక్ష్మి పేర్కొన్నారు. 2022లో చౌడేశ్వరీ రిజిస్ట్రేషన్ స్థలంలో వంశీ ప్రోద్బలంతో తులసి రాణి, జయశ్రీలు పదిసెంట్ల స్థలాన్ని దొంగ ఈసీ సహాయంతో వంశీ ప్రధాన అనుచరులైన సూరపనేని అనిల్‌కుమార్, ఎస్‌విఎస్ రామకృష్ణకు ఐదు సెంట్ల చొప్పున రిజిస్ట్రేషన్ చేయించారు. స్థలంలో గోడ నిర్మాణం చేస్తుండగా వంశీ అనుచరులైన మేచినేనిబాబు, బీవీ నరసింహారెడ్డి, అనిల్‌కుమార్, రంగా, ఎంపీపీ అనగాని రవి, ఎస్‌విఎస్ రామకృష్ణ మరికొంత మందితో వచ్చి కర్రలు, రాళ్లు, మరణాయుధాలతో దాడి చేయగా అక్కడి నుంచి పారిపోయానని, మరుసటి రోజు స్థలం అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న అనిల్ కుమార్, రామకృష్ణలు, పదిసెంట్ల స్థలాన్ని వంశీ అనుచరుడైన మేచినేనిబాబు కుమారుడు ఎంవిఎస్ రవితేజ పేరున తప్పుడు ఈసీ తయారు చేసి ఎస్ఆర్‌వోకు ఫేక్ సమాచారం ఇచ్చి రిజిస్ట్రేషన్ చేశారని సీతామహాలక్ష్మి ఫిర్యాదులో పేర్కొన్నారు. వంశీ, అతని అనుచరులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు. సీతామహాలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పానకాల చెరువు తవ్వకాలపై..

గన్నవరం శివారు మర్లపాలెంలోని పాలకాలు చెరువును అభివృద్ధి చేస్తామని మాయమాటలు చెప్పి నెల రోజులపాటు10, 12 జేసీబీలు, ఎక్స్‌కవేటర్‌లతో 15అడుగుల లోతు అక్రమ మైనింగ్ చేశారని పలువురు రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై వల్లభనేని వంశీ, మేచినేనిబాబు, అనగాని రవి, ఓలుపల్లి మోహనరంగా, కాట్రు శేషులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బిల్లులు ఎగ్గొట్టడంపై మరో కేసు..

చంద్రబాబు ప్రమాణాస్వీకారం నాడు ఆ ప్రాంతంలో ఓలుపల్లి మోహనరంగా బినామి అయిన కడియాల సతీష్, లింగమనేని కిషోర్‌లు ఒక క్వారీ నుంచి గ్రావెల్‌ను తీసుకువచ్చి మట్టి ఫిల్లింగ్ చేశారు. బిల్లులు చేయించుకుని క్వారీ యజమానికి నగదు చెల్లించకపోవటంతో ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వంశీ, అనుచరులపై ఛీటింగ్ కేసు

ఉంగుటూరు : అగ్రిమెంట్ చేసిన పొలాన్ని ఆన్‌లైన్ చేయిస్తానని నమ్మించి, డాక్యుమెంట్లు, పాస్‌బుక్స్ తీసుకుని మోసంచేయడమే కాకుండా, అదేమని అడిగినందుకు బెదిరించి, కుట్రపూరితంగా తప్పుడు పత్రాలు సృష్టించి ఒక వ్యక్తికి చెందవలసిన ఆస్తిని నకిలీ పత్రాలు సృష్టించి వేరే వాళ్లకు రిజిస్ట్రేషన్ చేయించి, బాధితునికి తీవ్ర అన్యాయం చేసిన వల్లభనేని వంశీతో పాటు అతడి అనుచరులపై ఆత్కూరు పోలీస్‌స్టేషన్లో ఛీటింగ్ కేసు నమోదైంది.

కృష్ణాజిల్లా, ఉంగుటూరు మండలం, తేలప్రోలు గ్రామానికి చెందిన శనగల శ్రీధర్‌రెడ్డి(52) రైల్వే కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో ఉంగుటూరుకు చెందిన షేక్ కతీజాబేగం అలియాస్ సుగుణాబాయమ్మ కుమారుడు ఉద్దండు రాజీవ్ పరిచయమయ్యాడు. వ్యాపారంలో పెట్టుబడి నిమిత్తం శ్రీధర్‌రెడ్డిని డబ్బులు అప్పుగా అడుగ్గా వింతా కృష్ణారెడ్డి అనే వ్యక్తితో హామీ సంతకంపెట్టించి 10లక్షలు అప్పుగా ఇచ్చాడు. తర్వాత రాజీవ్ అనారోగ్యానికి చికిత్సకోసమని, కుటుంబఅవసరాలకోసమని దఫాలుగా శ్రీధర్‌రెడ్డి దగ్గర తీసుకున్న అప్పు 2016 నాటికి 89లక్షలకు చేరింది. ఈక్రమంలో అప్పు తీసుకున్న రాజీవ్ హఠాత్తుగా చనిపోవడంతో అతని తల్లి కతీజాబేగంను కలిసి తనకు ఇవ్వాల్సిన డబ్బులు గురించి శ్రీధర్‌రెడ్డి అడిగాడు. దీంతో కతీజాబేగం ఉంగుటూరులో తనకు వారసత్వంగా సంక్రమించిన 124/22, 23, 24, 25, 26, 30, 31, 32, 33, 34, 40, 41, 42, 43, 198/1, 2, 187/1, 114/2, 3, 4 5ఏ, 5బి సర్వేనెంబర్లలో గల వ్యవసాయభూమి ఎ8.91సెంట్లను అగ్రిమెంట్ చేసి ఒరిజినల్ పాస్‌బుక్‌లు, డాక్యుమెంట్లు శ్రీధర్‌రెడ్డికి అప్పగించింది. ఆ తర్వాత 2016 సెప్టెంబర్ 2న హఠాత్తుగా కతీజాబేగం కూడా మరణించింది. దీంతో గ్రామానికి చెందిన భీమవరపు యతేంద్ర రామకృష్ణ అలియాస్ తేలప్రోలు రాము శ్రీధర్‌రెడ్డిని కలిసి కతీజాబేగం రిజిస్ట్రేషన్ చేయకుండానే చనిపోయిందని తనకు తెలుసునని, రెవెన్యూఅధికార్లతో మాట్లాడి ఆమె అగ్రిమెంట్‌చేసిన భూమిని రిజిస్ట్రేషన్ చేయించి ఆన్‌లైన్ కూడా చేయిస్తానని చెప్పి శ్రీధర్‌రెడ్డి దగ్గర వున్న ఒరిజినల్ డాక్యుమెంట్లు, పాస్‌బుక్‌లు, ప్రాంసరీ నోట్లు తీసుకున్నాడు. నెలలు గడుస్తున్నా ఎటువంటి సమాచారం లేకపోవడంతో శ్రీధర్‌రెడ్డి నేరుగా రాముని కలిసి రిజిస్ట్రేషన్ గురించి ఆరాతీశాడు, ఆవిషయం స్వయంగా అప్పటి ఎమ్మెల్యే వంశీ పర్సనల్‌గా చూస్తున్నారని, ప్రస్తుతం ఆయన బిజీగా వున్నారంటూ రాము మాట దాటేశాడు. శ్రీధర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పడంతో వంశీ పీఏగా వున్న ఓలుపల్లి రంగా శ్రీధర్‌రెడ్డికి ఫోన్‌చేసి మాట్లాడాలి ఆఫీస్‌కు రమ్మని చెప్పాడు. గన్నవరంలోని ఆఫీసుకు వెళ్లిన శ్రీధర్‌రెడ్డిని చూసిన వంశీ కోపంతో రగిలిపోతూ ఏంటి రాము మీద కంప్లైంట్ ఇస్తానన్నావంట ఏమనుకుంటున్నావు అసలు కతీజాబేగంను నువ్వేచంపావని పోలీస్‌స్టేషన్లో కంప్లైంట్ ఇచ్చి, నీమీద మర్డర్ కేసు కట్టిస్తాను.. జీవితాంతం బయటకురావని బెదిరించడంతో ఇదేమి అన్యాయమని అడిగిన శ్రీధర్‌రెడ్డిని అక్కడే వున్న రంగా, రాము, సూరపనేని అనిల్, మేచినేనిబాబు అలియాస్ సత్యనారాయణ, అనగాని రవి, కాట్రు శేషుకుమార్, వీర్రాజు అలియాస్ రాజాలు కలగజేసుకుని గొడవ చేయకుండా సైలెంట్‌గా వుంటే ప్రాణాలన్నా మిగులుతాయ్, లేదంటే చస్తావ్, సార్.(వంశీ)చెప్పిన మాట విను అంటూ భయపెట్టారని, జరిగిన మోసాన్ని ఎవరికి చెప్పినా ఫలితం లేకపోవడంతో తన డాక్యుమెంట్లు, పత్రాలు తనకు ఇప్పించమని అనేకసార్లు వంశీ అనుచరులను బ్రతిమిలాడినట్టు శ్రీధర్‌రెడ్డి తెలిపాడు. అయినా కనికరించని వంశీ అనుచరులు చనిపోయిన కతీజా బేగంకు వారసుడు వున్నట్లు కొన్ని తప్పుడు ఫ్యామిలీమెంబర్ సర్టిఫికెట్లు సృష్టించి, నకిలీ డాక్యుమెంట్లు తయారుచేయించి, నర్రా వెంకటసాయికృష్ణ, నక్కా వెంకటేశ్వరరావు, నర్రా సర్వేశ్‌కుమార్, నక్కా కోటేశ్వరరావు, ఇతరులు కొంతమందికి సేల్ రిజిస్ట్రేషన్ చేశారు. జరిగిన అన్యాయంపై పోలీసులకు ఫిర్యాదుచేసేందుకు ప్రాణభయంతో వెనుకాడిన శ్రీధర్‌రెడ్డి వంశీ జైలుపాలు కావడంతో ధైర్యంచేసి సోమవారం ఆత్కూరు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఛీటింగ్ చేసి తన కుటుంబానికి తీరని అన్యాయం చేసిన వంశీ, అతని అనుచరులతోపాటు, ఫోర్జరీకి సహకరించిన మిగతా వారందరికీ చట్టప్రకారం శిక్ష విధించాలంటూ పోలీసులకు విజ్ఞప్తిచేశాడు. దీంతో వంశీ, అతని అనుచరులపై ఎస్సై సురేష్ ఛీటింగ్ కేసు నమోదుచేశారు.

తప్పులతడక

(5వ పేజీ తరువాయి)

అసిస్టెంట్ కమిషనర్ విడుదల చేశారు. షెడ్యూలు ప్రకారం ఈ ఏడాది జనవరి 5వ తేదీన పంచాయతీల ఆదాయ వనరుల అంచనాలను రూపొందించి, డ్రాఫ్ట్ విడుదల చేయాలని ఆదేశించారు. అదేరోజు తొలివిడత గ్రామసభలను కూడా నిర్వహించాలని సూచించారు. వీటిని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయానికి అనుసంధానంగా ఉండే పీఆర్ వన్‌యాప్‌లో జనవరి 6న ఈ వివరాలను అప్‌లోడ్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 10లోగా మార్పులు, చేర్పులు చేసి తుది నివేదికను ఆప్‌లోడ్ చేయాలని సూచించారు. 10 నుంచి 20వ తేదీ వరకు పంచాయతీల్లో రికార్డు అసిస్టెంట్‌లు, సర్పంచ్‌లు, ఈవోలు, ఇతర సిబ్బందికి ఈ అంశంపై శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు. పీఆర్‌వన్ యాప్‌లో నమోదు చేసిన వివరాలను జనవరి 20 నుంచి 25వ తేదీ వరకు మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారులు పరిశీలించాలని సూచించారు. జనవరి 28లోగా రెండో సారి గ్రామసభలను నిర్వహించి ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలియజేసి, పూర్తి వివరాలను పీఆర్ వన్‌యాప్‌లో ఆప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. పంచాయతీ రాజ్ విభాగం నూతనంగా రూపొందించిన నివేదికలను ఈ-గ్రామ స్వరాజ్య పోర్టల్‌లో జనవరి 31న ఆప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీచేశారు.

నమోదులో ఇబ్బందులు

గ్రామ పంచాయతీల్లో రూపొందించిన అంచనాలను ఈ-గ్రామ స్వరాజ్య పోర్టల్‌లో నమోదు చేసేందుకు పంచాయతీల్లో పనిచేసే సాంకేతిక సిబ్బంది ప్రయత్నిస్తుంటే అన్నీ తప్పుల తడకలుగా ఉండి సక్రమంగా నమోదు కావడంలేదు. ఉదాహరణకు పంచాయతీలకు వచ్చే ఆదాయంలో 30శాతం నిధులను సిబ్బంది జీతభత్యాలకు కేటాయిస్తారు. 15శాతం నిధులను తాగునీటి అవసరాల కోసం, 15శాతం నిధులను రహదారుల అభివృద్ధికి, 10శాతం నిధులను విద్యుత్ బిల్లులకు, కార్యాలయాల నిర్వహణ, ఇంటర్‌నెట్ వాడకం, స్థానికంగా ఉన్న ఇతరత్రా అవసరాల మేరకు కేటాయింపుల చేస్తారు. పీఆర్ వన్‌యాప్‌లోని వివరాలను ఈ-గ్రామ స్వరాజ్య పోర్టల్‌లో ఇచ్చిన ఫార్మట్‌లో నమోదు చేస్తుంటే అన్నీ పారిశుధ్యం విభాగం కాలమ్‌లో నమోదు అవుతున్నాయి. దీంతో ఈ ప్రక్రియ జనవరి 31వ తేదీ నుంచి నిలిచిపోయింది.

మార్చి వచ్చేస్తోందని ఆందోళన

ఈ-గ్రామస్వరాజ్య పోర్టల్‌లో సంబంధిత వివరాలను నమోదు చేయడంలో పంచాయతీ కార్యాలయాల్లో పనిచేసే సాంకేతిక సిబ్బందికి శిక్షణ ఇవ్వకపోవడంతోపాటు, అందులో నెలకొన్న సాంకేతిక సమస్యలను సరిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం లేదని పంచాయతీ కార్యదర్శులు అంటున్నారు. ఇదే పద్ధతిలో ఫిబ్రవరి నెల మొత్తం గడచిపోయిందని చెబుతున్నారు. ఆర్థిక సంవత్సరం ముగింపు సమయంలో పంచాయతీలకు సంబంధించి ఆర్థిక లావాదేవీలపై ఫ్రీజింగ్ విధిస్తారని పంచాయతీరాజ్ విభాగం అధికారులు అంటున్నారు. తప్పులు సరిదిద్దకుండా మార్చి నెలాఖరులోగా ఈ-గ్రామ స్వరాజ్య పోర్టల్‌లో అన్ని వివరాలను నమోదు చేయడానికి అవకాశం ఉండదని పంచాయతీల్లో పనిచేసే సిబ్బంది, అధికారులు చెబుతున్నారు. నూతన ఆర్థిక సంవత్సరంలో ఈ పనులు ఎప్పటికి పూర్తి చేయాలి, ఎప్పటికి పంచాయతీల్లో పాలన గాడినపడుతుందనే అంశంపై పంచాయతీరాజ్ విభాగం అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ప్రచారానికి తెర

(5వ పేజీ తరువాయి)

తరఫున రాజకీయ పార్టీలు, అనుబంధ సంఘాలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు భుజాన వేసుకుని ప్రచారాన్ని పతాక స్థాయికి చేర్చాయి.

ఆలపాటికి అనేక వర్గాల మద్దతు

ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు తెలుగుదేశం, జనసేన, బీజేపీలు రాజకీయంగా మద్దతును ప్రకటించాయి. ఆలపాటి మాజీ మంత్రిగా కూడా పనిచేశారు. విద్యావేత్తగా ప్రత్యేక ఇమేజ్‌ను సొంతం చేసుకున్నారు. ఈయనకు ఏపీ నిరుద్యోగ జేఏసీ మద్దతు ప్రకటించింది. వ్యాపారులు, యువత, పెన్షనర్లు, రైతు ప్రతినిధులు మద్దతు తెలిపారు. ప్రధానంగా కూటమి ప్రజా ప్రతినిధులు ఆలపాటికి ఎంతో వెన్నుదన్నుగా ఉన్నారు. ఆలపాటి విజయానికి కూటమి ప్రభుత్వ ప్రజా ప్రతిని ధులు, రాజకీయ నాయకులు ఏకతాటిపైకి వచ్చి కృషి చేస్తున్నారు. భారీ సభలు నిర్వహిస్తూ ఎన్నికల వాతావరణాన్ని ఒక్కసారిగా వేడెక్కించారు.

లక్ష్మణరావుకు వామపక్షాల అండ

కేఎస్ లక్ష్మణరావుకు వామపక్షాల అండ ఉంది. ప్రధానంగా యూటీఎఫ్, ఏపీఎంఎస్‌టీఎఫ్, ఏపీసీఎల్ఏ, పీఎల్ఏ, ఏఎస్‌ఈడబ్ల్యూఏ, ఏపీఏజేఎల్‌పీఏ, సీఐటీయూ, ఎల్ఐసీ, ఏఎల్ఐఈఏ, ఐసీఈయూ, బీఎస్ఎన్ఎల్, పోస్టల్, ఏపీఎస్ఆర్టీసీ, ఎస్‌డబ్ల్యూఎఫ్, బ్యాంక్ ఎంప్లాయిస్, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, జేవీవీ, కేవీపీఎస్, మెడికల్ రిప్రజంటేటివ్స్ అసోసియేషన్, ఐద్వా తదితర ఉద్యోగ, ప్రజా సంఘాలు మద్దతు పలికాయి.

ఇరువురు అభ్యర్థుల రాజకీయ అనుభవం

ఎన్టీఆర్, చంద్రబాబు నాయకత్వంలో పనిచేసిన సీనియర్ నాయకుడిగా, మాజీ మంత్రిగా ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. 1994, 1999, 2004, 2009, 2014, 2019 ఎన్నికల్లో ఆరు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేయగా మూడు సార్లు గెలుపొందారు. 2024లో తెనాలి సీటును జనసేనకు ఇవ్వాల్సి రావటంతో పోటీ చేయలేదు. దీంతో ఆలపాటికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో అవకాశం ఇచ్చారు. కేఎస్ లక్ష్మణరావు మూడు సార్లు ఎమ్మెల్సీగా గెలుపొందారు. రెండు సార్లు టీచర్స్ ఎమ్మెల్సీగా, ఒకసారి పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. రెండో సారి పట్టభద్రుల స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. ఆలపాటి విద్యావేత్త అయితే, కేఎస్ విద్యాదాతగా ఉన్నారు. ఇద్దరూ కూడా విద్యావిషయిక నేపథ్యం కలిగిన వారు కావటం గమనార్హం. ఇద్దరిదీ కూడా గుంటూరు జిల్లా అయినప్పటికీ వారికి ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలతో కూడా అనుబంధం ఉంది. కేఎస్ లక్ష్మణరావును ఓడించేందుకు ఆలపాటి ప్రత్యేక వ్యూహాలతో ముందుకు వెళుతుండగా.. కేఎస్ కూడా ఆలపాటిని ఓడించటానికి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఇద్దరు ఉద్దండులు తలపడటంతో ఎమ్మెల్సీ ఎన్నికలు ఉత్కంఠగా మారాయి. నిర్ణయాత్మక పోరు నేపథ్యంలో పట్టభద్రులకు ప్రధాన అభ్యర్థులు ఇద్దరూ కూడా తమ మ్యానిఫెస్టోలను ప్రకటించారు. విస్తృతంగా వాటిపై ప్రచారం చేశారు. విజయం ఎవర్ని వరించేనో వేచిచూడాలి.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 99, 110
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 485	

చెత్త నుంచి సంపదపై దృష్టి పెట్టాలి



గుణదల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : చెత్త నుంచి సంపద తయారు చేసే విధానంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ఈవోపీఆర్డీ దుర్గాప్రసాద్ తెలిపారు. విజయవాడ రూరల్ మండలంలోని నున్న పంచాయతీ పరిధిలోగల వర్మీ కంపోస్టు తయారీ కేంద్రం వద్ద పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్-1 నుంచి ఆరు వరకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు, క్లాప్ మిత్రలకు చెత్త నుంచి సంపద తయారీ అనే అంశంపై మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ రూరల్ మండల ఎంపీడీవో పి.మురళీకృష్ణ ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

లక్ష్మణరావును గెలిపించాలి

గన్నవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు ఎమ్మెల్సీ ఎన్నికల్లో కెఎస్ లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ ప్రజా సంఘాల నాయకులు మంగళవారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. నిబద్ధత గల విద్యావేత్త, నిరంతరం వివిధ రంగాల సమస్యలపై పోరాటాలు చేస్తూ అందరికి అందుబాటులో ఉండే వ్యక్తి లక్ష్మణరావు అని మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని కోరారు.

ఆలపాటి విజయం గుర్తుండి పోవాలి

నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు కోట వీరబాబు





జంక్షన్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న కోట వీరబాబు.. రంగన్నగూడెంలో ఆళ్ల ఆధ్వర్యంలో ప్రచారం

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయం చరిత్రలో గుర్తుండిపోయేలా ప్రతి బూత్ లెవల్ ఏజెంట్లు కృషి చేయాలని నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు, ఎన్ ఎస్పీ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కోట వీరబాబు అన్నారు. మంగళవారం స్థానిక విజయవాడ రోడ్డులోని ఆళ్ల గోపాలకృష్ణ ఆవరణలో ఎమ్మెల్సీ ఎన్నికల బూత్ ఇన్‌చార్జిలతో టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్ఎస్పీ ఎడమ కాలువ పీసీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, నాయకులు గుండపనేని ఉమా వరప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు, మూల్పూరి సాయికల్యాణి, వేగిరెడ్డి పాపారావు, సురేశ్, అట్లూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావును సత్కరిస్తున్న వైవీబీ, టీడీపీ నాయకులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : రంగన్నగూడెం, సింగన్నగూడెం, రేమల్లె, ఆరుగొలను, తదితర గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలోని ఉపాధ్యాయులతో పాటు నూతన పట్టభద్రులను మంగళవారం కలిసి కూటమి అభ్యర్థి ఆలపాటికి మద్దతుగా ఓటు వేయాలని టీడీపీ నేతలు కోరారు. రంగన్నగూడెంలో నూతన ఓటర్లను ఆళ్ల గోపాలకృష్ణ ఆధ్వర్యంలో వేణుగోపాల్, లక్ష్మీనారాయణ తదితరులు కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కలపాల కుమార్, కసుకుర్తి కృష్ణకిషోర్, అర్జునరావు, షేక్‌జాన్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ విన్సెంట్ స్కూల్, చైతన్య భారతి తదితర స్కూళ్లతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులను టీడీపీ నేత దయాల రాజేశ్వరరావు ఆధ్వర్యంలో కలిసి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఓటు వేయాలని కోరారు. పార్టీ నేతలు చిరుమామిళ్ల సూర్యం, గండేపూడి నితీష్‌కుమార్, మాతంగి వెంకటేశ్వరరావు, ప్రణీత్, రాజీవ్, తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం : మండలంలోని కేసరపల్లిలో కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం రాత్రి తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు మేడేపల్లి రమాదేవి ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు బాలకృష్ణ, బాను, గూడపాటి రవికు మార్, మేడూరి శేషుకుమార్, రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు : ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాను అత్యధి మెజారిటీతో గెలిపించాలని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఉయ్యూరు వచ్చిన కొనకళ్ల వైవీబీని ఆయన నివాసంలో కలిశారు. ఉయ్యూరు మాజీ చైర్మన్లు జంపాన పూర్ణచంద్రరావు, అబ్దుల్ ఖుద్దూస్, టీడీపీ నాయకులు జంపన వీరశ్రీనివాస్, రాజులపాటి ఫణి, అబ్దుల్లా, బూరెల నరేశ్, షైదయ్య, కోగంటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సవాళ్లను సమర్థవంతంగా అధిగమించాలి

పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు



సదస్సులో మాట్లాడుతున్న పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు

పెనమలూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్తు సవాళ్లను సమర్థవంతంగా అధిగమించేలా విద్యార్థులను సిద్ధం చేయడం మన బాధ్యతని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు అన్నారు. మంగళవారం పాఠశాల విద్యాశాఖ, ప్రభుత్వ పరీక్షల విభాగం సహకారంతో పరఖ్ ఆధ్వర్యంలో హోలిస్టిక్ ప్రోగ్రెసు కార్డులు, ప్రామాణిక ప్రశ్నాపత్రాల నమూనాలు సిద్ధం చేయడానికి విజయవాడ పోరంకి మురళీ రిసార్టులో వర్క్‌షాప్ నిర్వహించారు. పరీక్షల విభాగం డైరెక్టర్ డాక్టర్ కేవీ శ్రీనివాసులు రెడ్డి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బీవీ శ్రీనివాసరావు ఈ కార్యక్రమంలో ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి, పరఖ్- ప్రొఫెసర్ డాక్టర్ ఇంద్రాణి బాధురి తదితరులు పాల్గొన్నారు.



మద్దూరు పుష్కర్ ఘాట్‌లో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చిన భక్తులకు ఏర్పాటు చేసిన వసతులు

ఎన్టీఆర్ పుష్కర్ ఘాట్‌లో ఏర్పాట్లు పూర్తి

కంకిపాడు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మద్దూరు కార్యదర్శి చింతా కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, మద్దూరు ఎన్టీఆర్ పుష్కర్ ఘాట్‌లో ప్రతి ఏటా సుమారు 20 వేల నుంచి 25 వేల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు వస్తుంటారన్నారు. పుణ్యస్నానాలు ఆచరించేం దుకు వచ్చే భక్తులకు అవసరమైన టెంట్లు, ప్రత్యేక టాయిలెట్స్, మహిళలు దస్తులు మార్చుకునేందుకు అవసరమైన వసతి కల్పించటం జరిగిందన్నారు. భక్తులు పోలీసు, పంచాయతీ, రెవెన్యూ అధికారుల సూచనలను పాటించాలని కోరారు.

కరాటేలో సెయింట్ జోసఫ్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

విజయవాడ రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ ఆల్ ఇండియా ఓపెన్ కరాటే డో చాంపియన్ షిప్ 2025లో నున్న రోడ్డులోని సెయింట్ జోసఫ్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా స్కూల్ హెచ్ఎం సిస్టర్ థెరెసా స్టానిస్లాస్ మాట్లాడుతూ, ఈ నెల 23న చిలకలూరిపేటలో జరిగిన కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో వివిధ విభాగాల్లో తమ పాఠశాలకు చెందిన సామల లక్ష్మీదుర్గ మొదటి, దండూరి అద్వైత రెండు, దాసి అంకిత్ మూడో స్థానం సాధించారని తెలిపారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు

నవజీవన్ బాలభవన్ మీతోడు మానసిక వికాస కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం నున్న రోడ్డులోని సెయింట్ జోసఫ్ స్కూల్‌లో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బాలభవన్ కో-ఆర్డినేటర్లు జాకబ్ రాజు, దేవమణిలు వివిధ తరగతుల విద్యార్థులతో మాట్లాడి మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్ప్రభావాల గురించి వివరించారు. అలాగే సోషల్ మీడియా దుర్వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సిస్టర్ థెరీసా స్టానిస్లాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముస్తాబైన శివాలయాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : మహాశివరాత్రి సందర్భంగా బాపులపాడు మండలంలోని శివాలయాలు విద్యుత్ కాంతులతో, బంగారు వర్ణంలో మెరిసిపోతూ మంగళవారం ముస్తాబయ్యాయి. మడిచర్ల, కానుమోలు, మల్లవల్లి పెరికీడుల్లోని శివాలయాలు బుధవారం మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పించేలా ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో తెల్లవారు ఝామునుంచి శివయ్య దర్శనానికి వచ్చే భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఉయ్యూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ పరీక్షలకు ఉయ్యూరులో ఆరు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 2,425 మంది ప్రథమ, 1918 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఆకునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీశ్రీనివాస, ఏజీ అండ్ ఎస్‌జీఎస్, నారాయణ, శ్రీచైతన్య, శ్రీవిశ్వశాంతి జూనియర్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.

ఆటో డ్రైవర్ మృతి

గన్నవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అభయాంజనేయస్వామి ఆలయ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ చిట్టినగర్‌లో ఉండే మహ్మద్ రఫీ ఆటో డ్రైవర్. అతను కోడిగుడ్లను ట్రాన్స్‌పోర్ట్ చేస్తుంటాడు. ఈ నేపథ్యంలో మంగళవారం నూజివీడు నుంచి కోడిగుడ్లు తీసుకుని వస్తుండగా ఆటో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో డ్రైవర్ రఫీ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

గన్నవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ కేవీ శివయ్య తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 3528 మంది ఓటర్లకు 122, 123, 124, 125 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికలు స్వేచ్ఛగా, పార దర్శంగా, సక్రమంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు తీసుకున్నామన్నారు. ఓటర్ ఐడీ, ఆధార్ కార్డు, ఇతర గుర్తింపు కార్డును తీసుకువచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

గుణదల : విజయవాడ రూరల్ మండలంలో 11 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండలంలో 6874 మంది ఓటర్లు పట్టభద్రుల ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

అంగన్వాడీల శిక్షణతో ఉత్తమ ఫలితాలు సాధించాలి



ఉంగుటూరు జడ్పీ స్కూల్‌లో జ్ఞానజ్యోతి శిక్షణ తరగతుల్లో పాల్గొన్న అంగన్వాడీ కార్యకర్తలతో ఎంఈవో, సూపర్‌వైజర్లు

హనుమాన్‌జంక్షన్ ఫిబ్రవరి 25 (ఆంధ్ర జ్యోతి): సుశిక్షితులైన అంగన్వాడీ కార్యకర్తలంతా బాల బాలికలకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించి ఉత్తమ ఫలితాలు సాధించాలని బాపులపాడు ఎంఈవో రాంబాలసింగ్ కోరారు. స్థానిక బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో ఈ నెల 18 నుంచి నిర్వహించిన అంగన్వాడీ కార్యకర్తల జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. మొదటి విడత శిక్షణ కార్యక్రమంలో 81 మంది అం గన్వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. శిక్షణా కాలంలో కార్యకర్తలు తాము తయారు చేసిన ప్రాజెక్టు రిపోర్టులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం టీవీ. నాగేశ్వరరావు, రీసోర్సు పర్సన్స్ రాజా రత్నం, దేవి, శివశంకర్‌రెడ్డి, అంగన్వాడీ సూపర్ వైజర్లు శాంతి శిరీష, ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఉంగుటూరు : బాల్య సంరక్షణ, అభివృద్ధికి భరోసా ఇవ్వాలనే లక్ష్యంతో ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల బలోపేతంపై దృష్టి సారించిందని ఎంఈవో-2 జె.సాంబశివరావు అన్నారు. స్థానిక జడ్పీహైస్కూల్‌లో మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణా తరగతులు మంగళవారం ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఐసీడీ ఎస్ సూపర్‌వైజర్లు బి.పద్మాదేవి, ఎల్.దుర్గాదేవి, జిల్లా రిసోర్స్‌పర్సన్లు మాధవరావు, నాగబాబు, శోభనాద్రి, 67మంది అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉయ్యూరు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చిన్నారులకు నూతన విద్యావిధానం అమలుకు అంగన్‌వాడీలు కృషి చేయాలని ఎంఈవో బి పద్మారాణి అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జరుగుతున్న జీవన జ్యోతి శిక్షణ కార్యక్రమంలో ఎంఈవో సుధారాణి, ఎంపీడీవో శేషగిరిరావు పాల్గొని వివిధ అంశాలపై శిక్షణ నిచ్చారు.


దేవస్థానం ఏర్పాటు చేసిన బాత్‌రూమ్స్..


బాత్‌రూమ్స్ బయటికి వస్తున్న మురుగు..


మెట్లపై నుంచి జారుతున్న మురుగు..


మురుగు కాలువలా ఘాట్ పరిసరాలు..


పై నుంచి వచ్చిన మురుగు నదిలోకి..


స్నానాలు చేయాల్సింది ఈ మురుగులోనే..


స్నానాలు ఆచరిస్తున్న భక్తులు


మహిళల కోసం ఏర్పాటు చేసిన గదుల పక్కనే వ్యాపార దుకాణాలు

దుర్గగుడి, కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్య వైఖరితో పవిత్రమైన దుర్గాఘాట్ కలుషితంగా మారుతోంది. బాత్రూమ్‌ల నుంచి వచ్చే వ్యర్థపు నీరంతా ఘాట్‌లోకి పోతోంది. అక్కడే భక్తులు పవిత్ర స్నానాలు ఆచరిస్తున్నారు. ఎంతో పవిత్రంగా భావించే దుర్గాఘాట్ కాస్తా కలుషితంగా మారి నల్లగా తయారై దుర్గంధం వెదజల్లుతోంది. భక్తులు ఈ నీటిలోనే స్నానం చేసి అమ్మవారి దర్శనానికి వెళుతున్నారు. ఇది ఎంత అపచారమో అధికారులు ఆలోచించాలి. దూర ప్రాంతాల నుంచి నిత్యం భక్తులు భారీగా వస్తుంటారు. ఈ అపరిశుభ్రత చూస్తే ఎవరి పరువు పోతుంది? పేరుకు రాష్ట్రంలోనే రెండో అతి పెద్ద పుణ్యక్షేత్రం కానీ వసతులు చూస్తే నాసికరం. ప్రతిరోజూ దుర్గమ్మ దర్శనానికి వందల సంఖ్యలో భక్తులు దుర్గాఘాట్‌లో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. తర్వాత కాలినడకన ఘాట్ మార్గంలోనూ, మహామండపం ద్వారా దేవస్థానానికి చేరుకుంటారు. ఎంతో భక్తితో వచ్చే భక్తులకిచ్చే గౌరవం ఇదేనా?

ఆంధ్రజ్యోతి పరిశీలన



గలీజ్ ఘాట్

- దేవస్థానం, కార్పొరేషన్ అధికారుల నిర్లిప్తత
- మరుగుదొడ్ల వ్యర్థ నీరంతా దుర్గాఘాట్‌లోకే..
- నల్లగా మారుతున్న వైనం అక్కడే పుణ్యస్నానాలంటే ఎలా ?
- భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ఇవేం పనులు.?
- మహిళలు బట్టలు మార్చుకోవటానికీ ఇబ్బందులే!

దుర్గాఘాట్‌పై ఎందుకింత నిర్లక్ష్యం ?

ఆంధ్రజ్యోతి-విజయవాడ: దుర్గాఘాట్‌లో ఏర్పాటు చేసిన బాత్రూమ్‌ల నుంచి వ్యర్థపు నీరంతా దుర్గాఘాట్‌లోకి వస్తోంది. అక్కడ కాళ్లు, చేతులు కడిగిన నీరు, మూత్ర విసర్జన చేసిన సమయంలో కొట్టిన నీళ్లు, స్నానం చేసిన నీళ్లన్నీ పక్కనే ఓ మురుగు కాలువలా ఏర్పడి ఘాట్‌లోకి వచ్చి కలుస్తోంది. బాత్రూమ్‌లో ఉపయోగించిన నీరు కూడా మెట్ల మీదుగా ఘాట్‌లోకి చేరుకుంటోంది. ఇదే ఘాట్‌లో భక్తులు స్నానం చేస్తున్నారు. ఎలా ఉంటుందో ఒక్కసారి ఆలోచించుకుకోవాలి. ఇలాంటి దుర్గంధంతో కూడిన ఘాట్‌లో చేసిన స్నానాలను పవిత్ర స్నానాలు అనగలరా ?

బాత్రూమ్‌ల ఏర్పాటు ఇలాగేనా ?

ఎంతో పవిత్రమైన దుర్గాఘాట్‌లో యూరినల్స్, టాయ్‌లెట్లకు శాశ్వత ఏర్పాట్లు లేవు. ఘాట్‌పైనే ప్లాస్టిక్‌తో కూడిన రెడీమేడ్ టాయ్‌లెట్స్‌ను ఉంచారు. అదీనూ ఘాట్‌పై కావటం గమనార్హం. యూరినల్స్, టాయ్‌లెట్స్ అనేవి ఘాట్‌కు ఓ పక్కగా శాశ్వత ప్రాతిపదికన నిర్వహించాలి. వాటికి సిబ్బందిని పెట్టుకుని కొంత రుసుం వసూలు చేస్తే మెరిసిపోయేలా నిర్వహించవచ్చు. ఎక్కడేం చేయాలో అధికారులకు పట్టడం లేదు. దుర్గాఘాట్‌ను సందర్శించిన వీఎంసీ కమిషనర్ ఏం గుర్తించారో తెలియదు. కానీ రాష్ట్ర, జాతీయ స్థాయిలో బెజవాడ పరువు తీసే ఇలాంటి పనులకు అధికారులు బాధ్యత తీసుకోవాలి.

మహిళలకు అరకొర ఏర్పాట్లు

దుర్గాఘాట్‌లో మహిళలు దుస్తులు మార్చుకోవటానికి సరైన వసతులు లేవు. పైన ఓ మూల రేకుల షెడ్లు వేశారు. మహిళలు స్నానాల తరువాత దుస్తులు శరీరానికి అతుక్కుపోతాయి. ఇలా తడిచిన బట్టలతో పైనున్న బట్టలు మార్చుకునే గదులకు వెళ్లలేని పరిస్థితి. ఆ మార్గంలో విక్రయాలు జరిపేవారుండటంతో మహిళలు సిగ్గుపడుతున్నారు. పైగా అవేమైనా గొప్ప గదులా అంటే అదీ కాదు. కేవలం రేకుల షెడ్లు. పైగా వీటికి గ్రిల్స్ ఉంటాయి. ఆ మెస్‌కు షామియానా క్లాత్ కట్టారు. ఒక గది ఉన్నా దాని తలుపు స్థానంలో గ్రిల్స్ డోర్ ఉంది. ఇలాంటి అసౌకర్యపు బట్టలు మార్చుకునే గదుల ఏర్పాటుతో ఎవరికి ప్రయోజనమో అధికారులకే తెలియాలి. మహిళలు దుస్తులు మార్చుకోవటానికి బాత్రూమ్‌ల తరహాలో ఉండే సింటెక్స్ బాక్స్‌ను ఘాట్ దగ్గర క్రమ పద్ధతిలో ఉంచితే సౌకర్యంగా ఉంటుంది.

సందర్శనీయ ప్రాంతంగా తీర్చిదిద్దాలి

దుర్గాఘాట్ అనేది ఓ సందర్శనీయ ప్రాంతం. దీన్ని అభివృద్ధికి ఆమడ దూరంలో వదిలేశారు. చాలాచోట్ల ధ్వంసమైంది. కొంతభాగంలో మట్టి ఉంది. ఈ మట్టిపై మొక్కలను లాన్‌లా పెంచితే అందంగా ఉంటుంది. ఘాట్‌లో ఎక్కడికక్కడ అపరిశుభ్రత తాండవిస్తోంది. పరిశుభ్రత కనపడదు. ఎక్కడ పడితే అక్కడ తాళ్లు కట్టి ఉంటాయి. కాగితాలు, పాలిథిన్ బ్యాగులు ఎక్కడ పడితే అక్కడ పారేసి ఉంటాయి. దుర్గాఘాట్‌కు వచ్చిన వారు ఎప్పుడు వెళ్లిపోతామా అనుకునేవాళ్లే తప్ప కాసేపు గడిపే పరిస్థితి లేదు. ఘాట్‌లోకి వస్తే కృష్ణమ్మ పరవళ్లు, ప్రకాశం బ్యారేజీ కంటికి ఇంపుగా కనిపిస్తాయి. దూరంగా భవానీ ఐల్యాండ్ కనిపిస్తుంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో దుర్గాఘాట్‌ను చైనా సంస్థతో డిజైన్స్ చేయించి వినూత్నంగా నిర్మించారు. ఘాట్లన్నింటినీ రివర్‌ఫ్రంట్ ఘాట్లుగా తీర్చిదిద్దాలని చేశారు. వీటన్నింటినీ అధికారులు మరిచిపోవటం బాధాకరం. ఇప్పటికైనా రివర్ ఫ్రంట్ ఘాట్‌ల అభివృద్ధిపై అధికారులు దృష్టి పెట్టాలని భక్తులు కోరుతున్నారు.

జగన్‌ను ప్రజలే తిరస్కరించారు

- మంత్రులు కొల్లు, వాసంశెట్టి

చల్లపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్ వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డిపై మండిపడ్డారు. మంగళవారం చల్లపల్లిలో జరిగిన ప్రచార సభల్లో వారు పాల్గొన్నారు. ప్రతిపక్ష హోదాకోసం ప్లకార్డులు పట్టుకుని గవర్నర్ ప్రసంగానికి అడ్డుతగలటంపై కొల్లు రవీంద్ర మండిపడ్డారు. ప్రతిపక్ష హోదా కోసం అడుక్కోవటం ఏంటని ప్రశ్నించారు. ప్రజలే జగన్‌ను తిరస్కరించారన్నారు.

హైటెక్ వ్యభిచారం కేసులో మరో నిందితుడి అరెస్టు

విజయవాడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వెటర్నరీ కాలనీ ఫీడర్ రోడ్డులో స్టూడియో 9 స్పా ముసుగులో జరుగుతున్న హైటెక్ వ్యభిచారం కేసులో మరో నిందితుడిని మాచవరం పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు చలసాని ప్రసన్న భార్గవ్ ఇప్పటికే పరారీలో ఉండి ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. ఇదిలా ఉండగా ప్రసన్న భార్గవ్‌కు కస్టమర్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్న గాలి గోపీచంద్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పెనుగంచిప్రోలుకు చెందిన గోపీచంద్ విజయవాడ సిద్ధార్థ నగర్ నాలుగో లైన్‌లో ఉంటున్నాడు. అందమైన అమ్మాయిలతో సర్వీసు కావాలనుకునే వారిని గోపీచంద్, భార్గవ్‌కు చెందిన స్పాకు పంపుతుంటాడు. ఇలా పంపినందుకు వారానికి రూ.30 నుంచి 40వేలను గోపీచంద్‌కు భార్గవ్ చెల్లిస్తుంటాడు. ఈ మొత్తం లావాదేవీలు గూగుల్‌పే, ఫోన్‌పే ద్వారా జరిగాయని పోలీసులు గుర్తించారు. గోపీచంద్‌ను అరెస్టుతోపాటు అతడి ఫోన్‌ను పోలీసులు సీజ్ చేశారు.

ప్రతిష్ఠ దిగజార్చే పనులు సహించం

- కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని
- సమితి ప్రయోజనాలకు భంగం కలిగించేలా ప్రవర్తిస్తున్న అధ్యక్షులపై చర్యలు
- సర్వసభ్య సమావేశంలో సభ్యుల తీర్మానం
- ప్లాంట్‌లో వజ్రోత్సవ పైలాన్ ఆవిష్కరణ


నెయ్యి బాటిళ్లను ఆవిష్కరిస్తున్న చలసాని ఆంజనేయులు, దాసరి బాలవర్ధనరావు, తదితరులు

వన్‌టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎందరో మహానుభావుల దూరదృష్టి, పాడి రైతుల కృషితో దినదిన ప్రవర్ధమానం చెందుతూ శరవేగంగా విస్తరిస్తున్న కృష్ణా మిల్క్ యూనియన్ ప్రతిష్ఠను దిగజార్చే చర్యలను సహించేది లేదని చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. రైతుల భాగస్వామ్యంతో నడుస్తున్న సంస్థ తాను నిర్దేశించుకున్న బైలా ప్రకారం పనిచేస్తుందే తప్ప కొందరి స్వార్థ ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేయదని, అలాంటి తప్పు కృష్ణా మిల్క్ యూనియన్ ఎప్పుడూ చేయదన్నారు. కృష్ణా మిల్క్ యూనియన్ 60వ వార్షికోత్సవం సందర్భంగా విజయవాడలోని మిల్క్ ఫ్యాక్టరీ ఆవరణలో మంగళవారం సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా 60 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా వజ్రోత్సవ పైలాన్‌ను చైర్మన్ ఆంజనేయులు, సంఘ అధ్యక్షులు, సమితి సిబ్బంది సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ ఏర్పాటు దగ్గర నుంచి సంస్థ పురోగతికి కృషి చేసిన మహనీయులను గుర్తు చేసుకున్నారు. 20 ఏళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న 28 మంది మిల్క్ యూనియన్ అధ్యక్షులను ఘనంగా సత్కరించారు. ఇటీవల మిల్క్ యూనియన్ ప్రతిష్ఠను దిగజార్చేలా వ్యవహరిస్తూ సమితి ప్రయోజనాలను భంగం కలిగేలా ప్రవర్తిస్తున్న సంఘ అధ్యక్షులపై చర్య తీసుకోవాలని సమావేశం తీర్మానించింది. ఇదే సమయంలో గేదె, ఆవు పాల నుంచి తయారు చేసిన నెయ్యి లీటరు, అర లీటరు, 200 ఎంఎల్, 100 ఎంఎల్ పెట్ జార్ బాటిళ్లను ఆవిష్కరించారు.

ఎన్టీఆర్ చలవతోనే సంస్థ ఉజ్వలం

కృష్ణా మిల్క్ యూనియన్ ఇంత ఉజ్వలంగా ఉండటానికి 1995లో మ్యాక్స్ చట్టం (పరస్పర సహాయ సహకారం సంఘం)ను తీసుకువచ్చి టీడీపీ అధినేత, నాటి ముఖ్యమంత్రి, ఎన్టీఆర్ కానుకగా ఇచ్చారని సంస్థ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. సంస్థకు స్వయం ప్రతిపత్తి కల్పించి పాడి రైతుల సర్వతోముఖాభివృద్ధికి కారణభూతుడుగా నిలిచారన్నారు. 1997లో వేతనాలు చెల్లించలేని పరిస్థితుల్లో నాటి సీఎం చంద్రబాబు ప్రభుత్వ నిధుల నుంచి నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు రాష్ట్ర ప్రభుత్వ పూచీకత్తుపై రూ.4.12 కోట్లు గ్రాంట్‌గా, డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు గ్రాంట్‌గా రూ.4.12లక్షలు ఇప్పించడంతో ఆర్థిక కష్టాల నుంచి బయటపడ్డామన్నారు. ముక్కాల రాజు, మండవ జానకీరామయ్య, ఎన్టీఆర్, చంద్రబాబు కృషితో మిల్క్ యూనియన్ ఎంతగానో బలోపేతం చెందిందన్నారు.

అగ్నిప్రమాదంలో పెసర పైరు దగ్ధం




ఉంగుటూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): చెన్నై-కోల్‌కతా జాతీయరహదారి పక్కన పొట్టిపాడు టోల్‌ప్లాజా సమీపంలోని పొలాల్లో మంగళవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో మూడెకరాల పెసరపైరు దగ్ధం కాగా, సుమారు రూ.లక్ష మేర పంట నష్టం జరిగింది. గన్నవరం ఫైర్ ఆఫీసర్ షేక్ జాన్ అహ్మద్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన భూక్యా బాలాజీనాయక్ పదెకరాలు కౌలుకు తీసుకుని పెసరపైరు సాగుచేశాడు. ప్రస్తుతం పైరు కాయదశలో ఉంది. మరో 10రోజుల్లో పంట చేతికొస్తుంది. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 2గంటల సమయంలో పెసరపైరుకు హఠాత్తుగా నిప్పంటుకుని తగలబడి పోతోందని పక్క రైతు చెప్పటంతో బాలాజీనాయక్ తన కుమారుడు భూక్యా ప్రేమ్‌కుమార్ నాయక్‌ను వెంటపెట్టుకుని హడావుడిగా పొలానికి చేరుకున్నాడు, అప్పటికే పొలమంతా పొగలు, మంటలు వ్యాపించడంతో వెంటనే గన్నవరం ఫైర్‌స్టేషన్‌కు ఫోన్ చేశాడు, అగ్నిమాపకాధికారి నేతృత్వంలో హుటాహుటిన సంఘటనాస్థలానికి చేరుకున్న ఫైర్‌సిబ్బంది పి.సుధాకర్, ఎ.శివారెడ్డి, కే.సుధాకర్‌రావు, ఎం.వేణు మంటలు పక్కపైర్లకు వ్యాపించకుండా అదుపుచేశారు. నిర్లక్ష్యంగా తాగి పారేసిన సిగరెట్ లేదా బీడీ వల్ల అగ్ని ప్రమాదం జరిగి ఉంటుందని ఫైర్ ఆఫీసర్ తెలిపారు. అందినచోటల్లా అప్పులు తెచ్చి పెసరపైరుకు పెట్టుబడి పెట్టానని, ప్రతి మొక్కకు గుత్తులుగా విరగకాచిన కాయలను చూసి ఎకరాకు 4 బస్తాల చొప్పున దిగుబడులు వస్తాయని ఆశించానని, మరో 10 రోజుల్లో పైరు చేతికి వస్తుందనుకున్న తరుణంలో అగ్నికి ఆహుతవడం తీవ్ర ఆవేదనను మిగిల్చిందని, కౌలు రైతు బాలాజీనాయక్ వాపోయాడు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

ఆలపాటిని అత్యధిక ఓట్లతో గెలిపించాలి

- విజయవాడలో ఎంపీ శివనాథ్, ఆలపాటి ముమ్మర ప్రచారం


ప్రచారం చేస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్

వన్‌టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గెలుపు కోసం విజయవాడలో విస్తృత ప్రచారం జరిగింది. పోలింగ్‌కు 48 గంటల ముందర ప్రచారాన్ని ముగించాలన్న నిబంధన ఉండటంతో టీడీపీ, కూటమి నేతలు విస్తృతంగా ప్రచారం చేశారు. విజయవాడ కార్పొరేషన్ కార్యాలయంలో రాజేంద్ర ప్రసాద్ పర్యటించి ఉద్యోగులను తనకు ఓటు వేయాల్సిందిగా అభ్యర్థించారు. గ్రాడ్యుయేట్‌లు, ఉపాధ్యాయులతో నేతలతో సమావేశాలు నిర్వహించారు. మంగళవారం సాయంత్రంతో ప్రచారం ముగిసింది. ఉదయం నుంచి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ పశ్చిమలోని విద్యాధరపురం, అప్పలస్వామి క్వారీ రోడ్డులోని కేసీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో మంగళవారం ఎంపీ శివనాథ్ సమావేశమై సమస్యలు పరిష్కరించే నేత రాజేంద్రప్రసాద్‌ను ఎన్నుకోవాలంటూ కోరారు. అలాగే సెయింట్ జోన్స్ స్కూల్‌లో ఉపాధ్యాయులతో సమావేశమైన ఎంపీ కేశినేని శివనాథ్ ఆలపాటిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇదే విధంగా అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మంగళవారం వీఎంసీ కార్యాలయంలో ప్రచారం నిర్వహించారు. ఉద్యోగులను కలిసి తనకు ప్రథమ ప్రాధాన్యత ఓటు ఇచ్చి గెలిపించాలని కోరారు. 48వ డివిజన్‌లో రాంజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ ప్రైవేట్ స్కూళ్లలో తెలుగు యువత పశ్చిమ అధ్యక్షుడు ఆర్.మాధవ ప్రచారం చేశారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు మద్దతు ఇచ్చి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న, టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్ మీరా, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్.బేగ్, కె.సి హైస్కూల్ ప్రిన్సిపాల్ హర్షవర్ధన్, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఫతావుల్లా, బీసీ గౌడ సాధికారిక కన్వీనర్ పామర్తి కిషోర్ బాబు, తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు ఆషా, టీడీపీ ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, జాస్తి సాంబశివరావు, చెన్నుపాటి ఉషారాణి, వీరమాచినేని లలిత, చెన్నుపాటి క్రాంతిశ్రీ, దేవినేని అపర్ణ, పొట్లూరి శివసాయి ప్రసాద్, మైలవరపు రత్నకుమారి, బుల్లా విజయ్‌కుమార్, గుడివాడ నరేంద్ర, మరుపిళ్ల రాజేష్, మహదేవ్ అప్పాజీ, వీఎంసీ మినిస్ట్రీరియల్, ఆల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.వి.ఎస్.చలం పలువురు కార్పొరేటర్లు, డివిజన్ల ఇన్‌చార్జ్‌లతో పాటు జనసేన నేత వి.నాగరాజు, బీజేపీ నేత హరిప్రసాద్, తెలుగు యువత నేతలు గూడేల రాము, ఇందుకూరి యువరాజ్, బొమ్మిడి త్రినాథ్, జ్యోతికిరణ్ పాల్గొన్నారు.


కూటమి అభ్యర్థులకు మద్దతు తెలుపుతున్న ఏపీ నిరుద్యోగ జేఏసీ నేతలు

ఏపీ నిరుద్యోగ జేఏసీ మద్దతు

మొగల్రాజపురం: కూటమి బలపరచిన పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థులకు ఏపీ నిరుద్యోగ జేఏసీ సంపూర్ణ మద్దతు అందిస్తోందని అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ ప్రకటించారు. మంగళవారం పిన్నమనేని రోడ్డులో ఒక హోటల్‌లో కృష్ణా గుంటూరు, ఈస్ట్‌వెస్ట్, పట్టభద్రుల నియోజకవర్గం అభ్యర్థులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, పేరాబత్తుల రాజశేఖర్, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గ అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు మద్దతుగా నిర్వహించిన మీడియా సమావేశం అభ్యర్థులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. అందుకే ఈసారి చంద్రబాబుపై నమ్మకంతో కూటమి అభ్యర్థులకు మద్దతిస్తున్నామన్నారు. కూటమి అభ్యర్థులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, పేరాబత్తుల రాజశేఖర్, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంపై నమ్మకం ఉంది

జగన్ ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్-2 జీవో నెంబరు 77ను హైకోర్టు సూచనలతో సుమోటాగా సవరించమని, కూటమి నేతలిచ్చిన హామీ మేరకు 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తారని, ఎమ్మెల్సీ కోడ్ అనంతరం మెగా డీఎస్సీ ప్రకటిస్తారని, జీవో నెంబరు 117 వల్ల జరిగిన అన్యాయం గుర్తించి దాన్నిరద్దు చేస్తారని, గ్రూప్-2 అభ్యర్థులకున్న అపోహలను తొలగిస్తారని నమ్మకంతో ఉన్నారన్నారు. ఏపీ నిరుద్యోగ జేఏసీ ఉపాధ్యక్షుడు ఉమ్మడి మహేష్, సభ్యులు వాస్పులి రాము, మజ్జి పార్వతి, ఏ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు దుర్గగుడిలో శివయ్య కల్యాణం



ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన మల్లేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ పూజాధికాలను నిర్వహించనున్నారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, 10 నుంచి 1 గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు త్రికాల అభిషేకాలు జరుగుతాయి. రాత్రి 9 గంటల నుంచి మహాన్యాసం అనంతరం లింగోద్భవ కాలాభిషేకాన్ని నిర్వహిస్తారు. అనంతరం పూజాధి ప్రక్రియలు ముగించి గంగా, పార్వతీ, మల్లేశ్వరస్వామి దివ్య లీలా కల్యాణమహోత్సవాన్ని నిర్వహిస్తారు. అలాగపాంచాహ్నిక దీక్షతో జరిగే కార్యక్రమాల క్రమంలో మంటప పూజలు, మూలమంత్ర హవనాలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులను దివ్యంగా అలంకరించారు. పట్టువస్త్రాలను ధరింపజేసి ఆభరణాలను అలంకరించారు. చందనాది దివ్య సుగంధ ద్రవ్యాలను సమర్పించి కల్యాణ క్రతువు ప్రారంభానికి ముందు అనుసరించాల్సిన వేదోక్త, శాస్త్రోక్త ప్రక్రియలను నిర్వహించారు. ఎదురుకోలోత్సవంలో పండితులు పాల్గొని అటు మల్లేశ్వర స్వామి తరపున, ఇటు గంగా, పార్వతీ అమ్మవార్ల తరపున మహోన్నత ప్రతిభ, విశేష మహత్యాలను, వారి వంశాల క్రమాన్ని వర్ణించారు.

ఇకపై పాదరక్షలకు రుసుము లేదు

దేవస్థానంలో భక్తులు పాదరక్షలు భద్రపరచుకునేందుకు బుధవారం నుంచి రుసుము వసూలు చేయబోవడం లేదని ఈవో రామచంద్ర మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థానమే పాదరక్షలను భద్రపరిచే స్టాల్‌ను నిర్వహిస్తుందన్నారు. భక్తులు ఉచితంగా తమ పాదరక్షలను భద్రపరచుకోవచ్చునన్నారు. ఇప్పటి వరకు కాంట్రాక్టర్ పాదరక్షల జతకు రూ.2 చొప్పున వసూలు చేస్తున్నాడని, అయితే లీజు కాలం ముగిసిపోవటంతో కనకదుర్గానగర్, ఘాట్ రోడ్డు వైపు గల పాదరక్షలు భద్రపరిచే స్టాండ్‌లను దేవస్థానం నిర్వహిస్తుందని తెలిపారు.


శ్రీకాళహస్తీశ్వరుడికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న దుర్గగుడి ఈవో

కాళహస్తీశ్వరుడికి దుర్గగుడి నుంచి పట్టువస్త్రాలు

వన్‌టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని కాళహస్తిలో కొలువైన జ్ఞానప్రసూనాంబికా సమేత కాళహస్తీశ్వరుడికి మంగళవారం విజయవాడ దుర్గామల్లేశ్వర దేవస్థానం తరపున ఈవో, దేవదాయ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ పట్టువస్త్రాలు సమర్పించారు. విజయవాడ నుంచి వెళ్లిన బృందానికి కాళహస్తి దేవస్థానం ఈవో టి.బాపిరెడ్డి, వేద పండితులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కాళహస్తీరుడికి, జ్ఞాన ప్రసూనాంబకు పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం రామచంద్రమోహన్ బృందానికి వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. దుర్గగుడి స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకుడు ఎల్. దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మార్చి 5న జిల్లా కేంద్రాల్లో 10న గుంటూరులో నిరసన దీక్షలు

ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి

గాంధీనగర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు మార్చి 5న జిల్లా కేంద్రాల్లో, మార్చి 10న గుంటూరులో నిరసన దీక్ష నిర్వహించాలని ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి తీర్మానించింది. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సమితి సమావేశం కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వడ్డే మాట్లాడుతూ రైతులు పండించిన అన్ని పంటలకు సీ2+50 శాతం కలిపి మద్దతు ధరలు ప్రకటించి దానికి చట్టబద్ధత కల్పించాలని, దేశవ్యాప్తంగా రైతులు, కౌలు రైతులు ఒక పర్యాయం తీసుకున్న పంట రుణాలు మాఫీ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2018లో ప్రకటించిన పీఎం కిసాన్ పథకానికి నిధులు పెంచాలని, పెరుగుతున్న సాగు ఖర్చుల దృష్ట్యా పెట్టుబడి సాయాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. సీనియర్ రైతు నేత వై.కేశవరావు మాట్లాడుతూ సెకి విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు డిమాండ్ చేసిన సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చాక అదే ఒప్పందాన్ని కొనసాగించడం దుర్మార్గమన్నారు. కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ధరల వ్యత్యాస పథకం మోసపూరిత పథమన్నారు. జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ హంద్రీ-నివా సుజల స్రవంతి, తెలుగు గంగా ప్రాజెక్టు, పూల సుబ్బయ్య వెలుగోడు ప్రాజెక్టులకు అవసరమైన నిధులు కేటాయించి వాటి నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. సింహాద్రీ ఝాన్సీ, పి.జమలయ్య, అక్కినేని భవానీప్రసాద్, డి.హరినాథ్, మర్రెడ్డి వెంకటరెడ్డి, రైతు నేతలు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 99, 110
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.485

నాయర్‌బడ్డీ సెంటర్‌లో ఆక్రమణల తొలగింపు



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆనుకుని రోడ్డు మార్జిన్లలో ఉన్న ఆక్రమణలను మంగళవారం మునిసిపల్ అధికారులు తొలగించారు. మునిసిపల్ కమిషనర్ బాపిరాజు ఆధ్వర్యంలో నాయర్‌బడ్డీ సెంటర్ నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు టౌన్‌ప్లానింగ్ అధికారులు హరిప్రసాద్ పర్యవేక్షణలో బడ్డీలను తొలగించారు. నగరంలో ఆక్రమణలు తొలగించే కార్యక్రమం మరో నాలుగు వారాల పాటు కొనసాగుతుందని కమిషనర్ బాపిరాజు చెప్పారు.

విద్యలో ఆధునిక, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం

● కృష్ణా యూనివర్శిటీ నూతన వీసీ కె. రాంజీ



కలెక్టర్ డీకే బాలాజీని మర్యాద పూర్వకంగా కలిసిన వీసీ రాంజీ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : విద్యా రంగంలో ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేలా విశ్వవిద్యాలయాన్ని తీర్చిదిద్దుతామని కృష్ణా వర్సిటీ నూతన వీసీ కె.రాంజీ పేర్కొన్నారు. కలెక్టర్ బాలాజీని మంగళవారం ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. మచిలీపట్నంలోని పద్మావతి డిగ్రీ కళాశాలను సందర్శించి కళాశాలలో కోర్సుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిలబస్‌లో మార్పులు, చేర్పులపై ప్రిన్సిపాల్ అన్నపూర్ణతో చర్చించారు. బాలికలు ఉన్నత విద్యావంతులైతే సమాజం అభివృద్ధి పథాన పయనిస్తుందన్నారు. గ్రాడ్యుయేట్లకు ఉపాధి అవకాశాలు కల్పించే అనువైన కోర్సులను ప్రవేశపెడతామన్నారు. విశ్వవిద్యాలయం అభివృద్ధికి ప్రిన్సిపాల్ అన్నపూర్ణ నుంచి సూచనలు, సలహాలు తీసుకున్నారు. విద్యార్థులు, అధ్యాపకులతో ముఖాముఖీ ఆయన మాట్లాడారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

మోపిదేవి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల స్థాయి నుంచే ప్రతి విద్యార్థి పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని మోపిదేవి బీసీ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె.వీరరవి అన్నారు. పాఠశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో పదవ తరగతిలో నూరు శాతం ఫలితాలు సాధించటంతోపాటు అత్యధికంగా మార్కులు సాధించే దిశగా పోటీ పడాలన్నారు. పోటీల్లో విజేతలైన విద్యార్థులకుబహుమతులు అందజేశారు.

ప్రభుత్వం న్యాయం చేయాలని అగ్రిగోల్డ్ బాధితుల వినతి

అవనిగడ్డ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం తక్షణం న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అగ్రిగోల్డ్ సమస్య సంవత్సరాల తరబడి కోర్టులో సాగుతోందని, దీంతో న్యాయం జరగక ఎంతో మంది కస్టమర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అగ్రిగోల్డ్ వ్యవసాయ భూములను చిన్న చిన్న ప్లాట్లుగా విభజించి, అమ్మి బాధితులకు న్యాయం చేయాలని, ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో ఈ మేరకు తీర్మానం చేసేలా సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు విన్నవించాలని కోరారు. పూర్ణచంద్రరావు, పోలి సుధాకర్, పి.వెంకట నారాయణరావు, ఎం.నెలబాలుడు, శ్రీనివాసరావు, ఎం.సాంబశివరావు, బుజ్జి, జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు కె.గగన్ తదితరులు పాల్గొన్నారు.



పులిగడ్డ సర్పంచ్ విజయకుమార్‌ను సత్కరిస్తున్న సింహాద్రి రమేష్

పులిగడ్డ సర్పంచ్ విజయకుమార్‌కు మాజీ ఎమ్మెల్యే సింహాద్రి సత్కారం

అవనిగడ్డ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మదర్ థెరెసా విశిష్ట సేవా పురస్కారం అందుకున్న పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్‌ను మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మంగళవారం ఘనంగా సత్కరించారు. వరదల సమయంలోనూ, కోవిడ్ సమయంలోనూ ప్రజలకు విశిష్ట సేవలందించినందుకు విజయ్ కుమార్‌కు విశ్వ ఆర్ట్స్ నిర్వాహకులు మదర్ థెరెసా పురస్కారం అందజేసింది. సింహాద్రి రమేష్‌బాబు ఘనంగా సత్కరించి ఆయనను అభినందించారు. జడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, రేపల్లె శ్రీనివాసరావు, గరికపాటి వెంకటేశ్వరరావు, సింహాద్రి వెంకటేశ్వరరావు, నలుకుర్తి పృథ్వీరాజ్, రాజనాల మాణిక్యాలరావు, గాజుల జైగోపాల్, చింతలపూడి బాలభాస్కర్‌రావు, గార్లపాటి గోపి తదితరులు పాల్గొన్నారు.

పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ డీఎంగా పోతురాజు

మచిలీపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా పౌరసరఫరాలశాఖ విజిలెన్స్ విభాగం డీఎంగా ఎస్.పోతురాజును నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం జీవో నెంబరు 408 జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా డిప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో భాగంగా పోతురాజును నియమించారు.





దుర్గానాగేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో శ్రీరామ వరప్రసాదరావు, స్నానఘాట్లలో బారికేడ్లు



నాగులేరు వద్ద ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న సీఐ

పుణ్యస్నానాలకు విస్తృత ఏర్పాట్లు

● పెదకళ్లేపల్లి దుర్గానాగేశ్వరస్వామి ఆలయం ముస్తాబు

మోపిదేవి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన పెదకళ్లేపల్లిలో మహాశివరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. దుర్గానాగేశ్వరస్వామి దేవస్థానానికి చాందిని టెంట్ డెకరేషన్‌తో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు సత్వరమే స్వామివారి దర్శనం కలిగేలా దేవస్థానం ఆధ్వర్యంలో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఉచితంగా మంచినీరు, పులిహోర ప్రసాదం అందించనున్నట్లు ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు.

స్నానఘాట్ల వద్ద పటిష్ట చర్యలు

పెదకళ్లేపల్లిలో ఉత్తరవాహినియై ప్రవహిస్తున్న కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వీలుగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రెవెన్యూ, పోలీసు, గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో స్నానమాచరించే భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలుగకుండా ఉండేలా కృష్ణానది లోపల ప్రత్యేకమైన బారికేడింగ్ ఏర్పాటు చేశారు. భక్తులు నదిలోపలికి వెళ్లకుండా మత్స్యశాఖ ఆధ్వర్యంలో పడవలతో గజ ఈతగాళ్ల గస్తీ ఏర్పాటు చేశారు. వృద్ధులు, వికలాంగులు, చిన్నారులకు స్నానమాచరించేందుకు వీలుగా జల్లు స్నానం ఏర్పాటు చేశారు. కృష్ణానది ప్రాంగణం వద్ద పితృదేవతలకు పిండ తర్పణం గావిం చేందుకు ప్రత్యేకంగా టెంట్లు ఏర్పాటుచేశారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కృష్ణానది ఘాట్ల వద్ద, దేవస్థానం వద్ద ఉచిత వైద్యశిబిరాలను సైతం ఏర్పాటు చేశారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో వివిధ ప్రాం తాల నుంచి పారిశుధ్య సిబ్బందిని డిప్యూటేషన్‌పై తీసుకొచ్చి గ్రామంలో పారిశుధ్య చర్యలు వేగవంతం చేశారు. డీఎల్‌పీవో సీతారామయ్య పర్యవేక్షణలో ఎంపీడీవో జె.స్వర్ణభారతి, ఈవోపీఆర్డీ కెటి.సుందరి కృష్ణానది ప్రాంగణం, గ్రామ పుర వీధుల్లో బ్లీచింగ్ చల్లి క్లోరినేషన్ చేసినట్లు గ్రామ సర్పంచ్ అరజా సంధ్యారాణి తెలిపారు. దుర్గా నాగేశ్వరస్వామివారి దేవస్థానం, కృష్ణా నది ఘాట్ల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా 150 మంది పోలీసు సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేశారు. అవనిగడ్డ డీఎస్పీ టి.విద్యశ్రీ, చల్లపల్లి సీఐ ఈశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసి భద్రతా చర్యలు కట్టుదిట్టం చేసినట్లు డిఎస్పీ తెలిపారు.

నాగులేటి ఒడ్డున జల్లు స్నానాలకు ఏర్పాట్లు

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నంలో నాగులేరులో పుణ్యస్నానాలు చేసేందుకు నగర పాలక సంస్థ అధికారులు ఏర్పాట్లు చేశారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక మరుగుదొడ్లు సిద్ధం చేశారు. స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో పులిహోర పంపిణీకి ఏర్పాట్లు చేశారు. మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, టీడీపీ నాయకులు సనకా నాగులు, ఇనకుదురు సీఐ పరమేశ్వర్, మునిసిపల్ అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు.

సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నాగాయలంక : సంగమేశ్వరంలో గంగా పార్వతీ సమేత సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజున ఉదయం స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమార్తె, పెండి కుమారునిగా అలంకరించి కొక్కిలిగడ్డ రామచంద్రరావు - నాగరోజా దంపతులు పీటలు మీద కూర్చుని కల్యాణం నిర్వహించారు. అర్చకులు కొల్లిపర శివసాయి తిరుమల భార్గవ్ అర్చకత్వం వహించారు. ఈవో సిహెచ్‌హ.సుధాకరరావు, సిబ్బంది, ఆలయ కమిటీ పాల్గొని పర్యవేక్షించారు.

మోదుమూడిలో మహాశాంతి హోమం

అవనిగడ్డ రూరల్ : మోదుమూడిలో ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం 60 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు మంగళవారంతో ముగిశాయి. సిర్విశెట్టి వెంకట నాగ రామకృష్ణ ప్రసాద్ - వైష్ణవి దంపతులచే స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి పూజలు నిర్వహించారు. మహాశాంతి హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి. అనంతరం మూడు వేల మందికి అన్నసమారాధన జరిగింది. సిర్విశెట్టి బాబురావు, బచ్చు నాగమల్లేశ్వరరావు పర్యవేక్షించారు.

పాతఎడ్లంకలో అరకొర ఏర్పాట్లు

అవనిగడ్డ రూరల్ : పాత ఎడ్లంక బాల కోటేశ్వరస్వామి ఆలయం వద్ద మహాశివరాత్రికి అధికారులు అరకొరగా ఏర్పాట్లు చేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయం ముందు చలువ పందిరి క్యూలైన్ వరకు కూడా ఏర్పాటు చేయకుండా చేతులు దులుపుకున్నారు. దేవదాయశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రతీ ఏటా వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది. రహదారులు సరిగ్గా లేకపోవటం, దానిపై అధికారులు దృష్టి పెట్టకపోవటంతో పాత ఎడ్లంక మహాశివరాత్రికి వెలవెలబోతుంది. అధికారులు భక్తులకు సరైన వసతులు కల్పించి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని గ్రామస్థులు కో రుతున్నారు.

ఆలపాటిని భారీ మెజార్టీతో గెలిపించండి : గోవర్ధన్



అవనిగడ్డ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో జనసేన, బీజేపీ బలపర్చిన టీడీపీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎన్ఆర్ఐ, పారిశ్రామిక వేత్త బొబ్బా గోవర్ధన్ కోరారు. అవనిగడ్డలో మంగళవారం ఆయన విలేకరులతో మా ట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులంతా ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు ఓటు వేయడం ద్వారా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు పరుగులు తీయిస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి మద్దతునిచ్చినట్లవుతుందన్నారు.

డాక్టర్ చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలు

అవనిగడ్డ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ క్యాన్సర్ వైద్యనిపుణులు, వైసీపీ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలను అవనిగడ్డలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ చంద్రశేఖర్‌రావు ఇంటి వద్ద కేక్ కట్ చేసి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. డాక్టర్ శ్రావణి, పులిగడ్డ వెంకటేశ్వరరావు, నలుకుర్తి పృథ్వీరాజ్, రాజనాల మాణిక్యాలరావు, సింహాద్రి వెంకటేశ్వరరావు, కమ్మిలి రాజా, కమ్మిలి శ్రీరామ్మూర్తి, గరికపాటి కృష్ణారావు, అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా అవతార్ మెహర్‌బాబా జయంతి



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : అవతార్ మెహర్‌బాబా జ యంతి ఉత్సవాలు మచిలీపట్నంలో మంగళవా రం వైభవంగా జరిగాయి. పోర్టు రోడ్డులోని మెహర్‌బాబా ఆడిటోరియంలో తాడేపల్లి మెహ ర్‌బాబా ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అజ్మీర్‌బాబా సేవా సమాజం ఆధ్వర్యంలో హోమియో మందులు పంపిణీ చేశారు.

చల్లపల్లిలో..

చల్లపల్లి : చల్లపల్లిలోని అవతార్ మెహర్ బాబా ప్రేమ మందిరంలో బాబావారి 131వ జయంతి ఉత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. హారతి, నగర సంకీర్తన, భజనలు, ఉయ్యాల, పేరంటం, ఊరేగింపు కార్యక్రమాలు జరిగాయి. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ బాబా ప్రేమమందిరాన్ని సందర్శించి పూజలు చేశారు. యువనేత మండలి వెంకట్రామ్, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, వైస్ఎంపీపీ మోర్ల రాంబాబు, నేతలు జల్లూరి ప్రసాద్, మోర్ల శివ, బొందలపాటి వీరబాబు పాల్గొన్నారు. బాబా సెంటరు అధ్యక్షులు చుండూరు మెహర్‌ప్రసాద్, చుండూరు ప్రభాకర్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆరు వేల మంది భక్తులకు అన్నసమారాధన జరిగింది.



ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు ఆర్డీవో పరిశీలన

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లను ఆర్డీవో స్వామి పరిశీలించారు. నోబుల్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్ బ్యాలెట్ బ్యాలెట్ బాక్సుల పంపిణీని పర్యవేక్షించారు. పెడన: జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌ను తహసీల్దార్ కె. అనిల్‌కుమార్, కమిషనర్ ఎం. గోపాలరావులు మంగళవారం సందర్శించారు. ఆర్ఐ విజయలక్ష్మి, వీఆర్వోలు పాల్గొన్నారు.

డీఎస్పీ విద్యశ్రీ పోలింగ్ కేంద్రాల సందర్శన

ఘంటసాల/మోపిదేవి/కోడూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఘంటలసాల, మోపిదేవి, కోడూరులోని ఎమ్మెల్సీ ఎన్నికల కేంద్రాలను అవనిగడ్డ డిఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ మంగళవారం పరిశీలించారు. రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయా మండలాల తహసీల్దార్లు ఆమె వెంట పాల్గొన్నారు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించండి

● మంత్రులు వాసంశెట్టి సుభాష్, కొల్లు రవీంద్ర విజ్ఞప్తి

చల్లపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్(రాజా)కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించాలని మంత్రులు వాసంశెట్టి సుభాష్, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి విజ్ఞప్తి చేశారు. చల్లపల్లిలో న్యాయవాదులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విజయ జూనియర్, వివేకానంద డిగ్రీ కళాశాల, విజయా అకాడమీల్లో సమావేశాలు నిర్వహించి ఎమ్మెల్సీ ఓట్లు అభ్యర్థించారు. మండలి వెంకట్రామ్, కనపర్తి శ్రీనివాసరావు, ఎన్నారై బొబ్బా గోవర్ధన్, జనసేన, జిల్లా నేతలు మత్తి వెంకటేశ్వరరావు, తలశిల స్వర్ణలత, పైడిపాముల కృష్ణకుమారి, రాయపూడి వేణుగోపాలరావు, కొల్లూరి వెంకటేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు, ఎంపీపీ కోట విజయ రాధిక, ఎంపీటీసీ స్వప్న, తోట కనకదుర్గ, మోర్ల శివ, బొందలపాటి వీరబాబు, కరస్పాండెంట్లు యార్లగడ్డ శివప్రసాద్, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, ప్రిన్సిపాల్స్ రమేష్‌బాబు, షేక్ అబ్దుల్ రహీం, నాగళ్ల భీమారావు పాల్గొన్నారు.

అమెరికా సదస్సుకు ఎమ్మెల్యే మండలికి ఆహ్వానం



అవనిగడ్డ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : అమెరికాలోని ఫిలడెల్ఫియాలో మార్చి 28, 29 తేదీల్లో జరగనున్న ఆంధ్రప్రదేశ్ అమెరికన్ అసోసియేషన్(ఏఏఏ) కన్వెన్షన్‌కు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను సంస్థ కన్వీనర్ సత్య వెజ్జు ఆహ్వానించారు. సత్య వెజ్జు మంగళవారం ఎమ్మెల్యేను ఆయన కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. సంస్థ ప్రతినిధులు స్వాతిశ్రీ, అవనిగడ్డ ప్రముఖులు బొప్పన లక్ష్మీనారాయణ ప్రసాద్, బొప్పన శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



రైతు విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరి

రైతు విశిష్ట సంఖ్య నమోదును పరిశీలిస్తున్న ఏవో సాయిసింధు

చల్లపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : సొంత భూమి కలిగిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి జి.సాయిసింధు కోరారు. ప్రభుత్వాలు రైతులకు అందచేసే పలు రాయితీలు, పథకాలకు విశిష్ట సంఖ్య నమోదు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పీఎం కిసాన్ లబ్ధిదారులు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. మండలంలో 5289 మంది రైతులు ఉండగా, 3226 మంది రైతుల నమోదు జరిగిందనీ, ఇంకా మిగిలి ఉన్న 1865 మంది రైతులు నమోదు చేసుకోవాలని కోరారు.

రైతు విశిష్ట సంఖ్య నమోదుపై అవగాహనా కార్యక్రమాలు

ఘంటసాల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుపై అవగాహన కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్నాయని ఏవో కె.మురళీకృష్ణ తెలిపారు. 13 రైతు సేవా కేంద్రాల్లో రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుపై మైక్, టాం టాం ద్వారా ప్రచారం చేశామన్నారు. 26, 27 తేదీల్లో కూడా రైతు సేవా కేంద్రాల్లో నమోదు కార్యక్రమం జరుగుతుందన్నారు. కావున రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూమి కలిగిన ప్రతి రైతు నమోదు చేసుకోవాలని ఏవో కోరారు.



పొలాలను పరిశీలించిన విత్తనోత్పత్తి పర్యవేక్షణ బృందం

ఘంటసాల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాలలోని కృషి విజ్ఞాన కేంద్రంలోని విత్తనోత్పత్తి పొలాలను విత్తనోత్పత్తి పర్యవేక్షణ బృందం పరిశీలించారు. రైతులకు మేలైన విత్తనాలను అందించటంలో కేవీకే ప్రధాన పాత్ర పోషించాలని బృందం పేర్కొన్నారు. 141, జీబీజీ 190 మినుము రకాలు చీడపీడలు తట్టుకునే శక్తి మొదలగు అంశాలను పరిశీలించి రైతుల అభిప్రాయాలను సేకరించారు. శాస్త్రవేత్త డాక్టర్‌డి.మోహన్‌రెడ్డి, విత్తనోత్పత్తి అధికారి డాక్టర్ ఎన్.హరి సత్యనారాయణ, శాస్త్రవేత్త డాక్టర్ జె.సతీష్ బాబు, సమన్వయకర్త డాక్టర్ సుధారాణి, శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటలక్ష్మి, డాక్టర్ నవీన్, డాక్టర్ రేవతి, వ్యవసాయ పరిశోనాస్థానం శాస్త్రవేత్తల బృందం, రైతులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, వేమూరి రత్నగిరిరావు పాల్గొన్నారు.

కలుపు యాజమాన్యంపై క్షేత్ర సందర్శన

చల్లపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాల కృషివిజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తల బృందం నిమ్మగడ్డలో మినుము పంటలో కలుపు యాజమాన్యంపై మంగళవారం క్షేత్ర సందర్శన చేపట్టారు. కలుపు ఆశించటం వల్ల దిగుబడులు 20-30 శాతం గణనీయంగా తగ్గుతాయని శాస్త్రవేత్తలు డాక్టర్ సుధారాణి, డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి రైతులకు తెలిపారు. శాస్త్రీయ, సమగ్ర యాజమాన్య పద్ధతులతో సత్ఫలితాలు పొందవచ్చని వివరించారు. క్షేత్రస్థాయి పరిశోధనా ఫలితాలను రైతులకు వివరించారు. డాక్టర్ కె.రేవతి, సుబ్బారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఆటల పోటీలు

అవనిగడ్డ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల 48వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కళాశాల ఆవరణలో ఆటలపోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డి.ఉమారాణి ఆధ్వర్యంలో మహిళలకు, పురుషులకు విడివిడిగా టెన్నికాయిట్, త్రోబాల్, షటిల్ బ్యాడ్మింటన్, ఖో-ఖో, కబడ్డీ, రన్నింగ్, లాంగ్‌జంప్, చెస్, క్యారమ్స్ మ్యూజికల్‌చైర్స్, టగ్ ఆఫ్ వార్ అంశాల్లో పోటీ లు నిర్వహించారు. ఇన్‌చార్జ్ పీడీ డాక్టర్ వై.ఎస్.సిహెచ్.రవిబాబు పర్యవేక్షించగా, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 229 మంది

కోడూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీ నుంచి 299 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు ఎంఈవో రామదాసు తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం 102 మంది, ఇంటర్ రెండవ సంవత్సరం 127 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. వీరికి అవనిగడ్డ పరీక్షా కేంద్రం కేటాయించినట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

మోపిదేవి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): దొంగతనం చేసిందని అభాండాలు వేయడంతో అవమానంగా భావించి తుమ్మా వెంకటేశ్వరమ్మ అనే మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంకటాపురం గ్రామానికి చెందిన ఓ కుటుంబం వెంకటేశ్వరమ్మ తమ ఇంట్లో బంగారం, నగదు దొంగిలించిందని పోలీస్ స్టేషన్‌లో జనవరి 21న ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ నిమిత్తం స్టేషన్‌కు పిలవటంతో అవమానంగా భావించిన వెంకటేశ్వరమ్మ మంగళవారం ఉదయం విషపు గుళికలు నీటిలో కలుపుకుని తాగింది. కుటుంబ సభ్యులు గమనించి చల్లపల్లిలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా డాక్టర్లు మచిలీపట్నం ప్రభుత్వ వైద్యశాలకు రిఫర్ చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	90, 99, 110
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 485



ఇంటర్ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

నందివాడ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలు మార్చి ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు రుద్రపాక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సి.హెచ్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో రుద్రపాక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఒక్కటే పరీక్ష కేంద్రంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నందివాడ 10 ప్లస్ హైస్కూల్‌లో 24 మంది ఇంటర్ విద్యార్థులు చదువుతున్నారని, వారు రుద్రపాక ప్రభుత్వ పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. రుద్రపాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 104 మంది, నందివాడ కాలేజీ విద్యార్థులు 24 మంది మొత్తం 128 మంది పరీక్షలు రాస్తారని తెలిపారు. కేంద్రంలో విద్యార్థులకు కావాల్సిన తాగునీరు, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మహాశివరాత్రికి ఆలయాలు ముస్తాబు



విద్యుత్ దీపకాంతులతో గుడ్లవల్లేరు గంగాపార్వతీ సమేత సిద్దేశ్వరస్వామి ఆలయం

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరులో ఉన్న శ్రీమత్ గంగాపార్వతీ సమేత సిద్ధేశ్వర స్వామి ఆలయంలో బుధవారం మహాశివరాత్రి వేడుకలు నిర్వహించనున్నారు. 1745 లో ఈ ఆలయాన్ని నిర్మించారు. ఆ తరువాత వంద సంవత్సరాలకు ఒకసారి జీర్ణోద్ధరణ చేయగా 29 సంవత్సరాల క్రితం మరోసారి జీర్ణోద్ధరించి ఆదునిక నిర్మాణం చేశారు. సిద్ధేశ్వరునికి ఇరువైపులా వీరభద్రుడు, పార్వతీ అమ్మవారు. ఎదురుగా పెద్ద ఏకరాతి నందీశ్వరుడు, గర్భాలయ ఉత్తరదిక్కున చండీశ్వరుడు కొలువుతీరారు. ఆలయ ప్రాంగణంలోనే విఘ్నేశ్వర, సుబ్రహ్మణ్యేశ్వర, అయ్యప్ప, ఆంజనేయ స్వామి, షిరిడి సాయిబాబా, నవగ్రహాల ఉపాలయాలు అపుడే నిర్మించారు. గత నెలలో నూతనంగా సరస్వతీ దేవి మందిరం కూడా నిర్మించారు. ఈ ఆలయానికి కంఠమనేని వారి వంశీకులు కొన్ని తరాలుగా వంశపారంపర్యంగా అర్చకత్వం నిర్వహిస్తున్నారు. 29 ఏళ్ల నాడు ఆలయం బాగా పల్లంగా ఉండడంతో వల్లభనేని వెంకట్రావు, కొనసరాజు వెంకటాద్రి (పెదబాబు) ల నేతృత్వంలో మరికొందరు గ్రామ పెద్దలతో కమిటీ ఏర్పాటు చేసి ఆలయాన్ని గ్రామస్థుల సహకారంతో పునఃనిర్మించారు. ఆనాటి నుంచి సింహభాగం కొనసరాజు వెంకటాద్రి ఆలయ చైర్మన్‌గా ఉంటూ ఉత్సవాలు,పూజాది కార్యక్రమాలు, కోటి దీపోత్సవాలు, ప్రభోత్సవాలు తదితర ప్రత్యేక కార్యక్రమాలు భక్తుల సహకారంతో నిర్వహిస్తూ వస్తున్నారు. కొంత కాలం యలమంచిలి రామకోటేశ్వరరావు కూడా ఆలయ చైర్మన్‌గా సేవలు నిర్వహించారు.

పెదపారుపూడి: పెదపారుపూడి మండలం వెంట్రప్రగడ గ్రామంలోని భక్తులు కోర్కెలు తీర్చే మహిమాన్వితుడిగా పూజలందుకుంటున్న వెంట్రప్రగడ భ్రమరాంబ సమేత నామేశ్వరస్వామి ఆలయాన్ని మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నారు. ఈవో దుర్గ ధనప్రసాద్ భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అర్చకులు మాట్లాడుతూ వెంట్రప్రగడ గ్రామంలో క్రీ.శ 1500 నాటి స్వామి రెడ్డి రాజులు పరిపాలించిన కాలములో స్వామివారు స్వయంగా వెలిశారని, 18 తరాలుగా పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం ఉదయం స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

ఐలూరు రామేశ్వరస్వామి దేవస్థానం

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి ఉత్సవాలకు ఐలూరు పుణ్యక్షేత్రం ముస్తాబయింది. ఈ నెల 26న జరగనున్న మహాశివరాత్రికి అన్ని శాఖల అధికారులు మంగళవారం సాయంత్రానికి ర్పాట్లు పూర్తి చేశారు. రామేశ్వర స్వామి దేవస్థానం వద్ద భక్తులు క్యూ లైన్‌లో దర్శనానికి బారికేడ్లు, షామియానాలు ఏర్పాటు చేశారు. కృష్ణానదీపాయలో జల్లు స్నానాలకు నాలుగు బోర్లను నిర్మించి ప్లాస్టిక్ పైపులను సిద్ధం చేశారు. ట్రయల్ రన్ కూడా పూర్తి చేశారు. అలాగే నదీపాయలో మంచినీటికి చేతిపంపులను నిర్మించారు. మహిళా భక్తులు స్నానాలు చేశాక దుస్తులు మార్చుకునేందుకు పరదాలతో కట్టారు. ప్రత్యేక పారిశుధ్య సిబ్బంది రహదారులను శుభ్రపర్చారు. ఈ ఏర్పాట్లను తహసీల్దార్ ఎం.కుసుమకుమారి, ఎంపీడీవో రవికాంత్, ఈవోపీఆర్‌డీ వెంకటేశ్వరమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్బారావు పర్యవేక్షించారు.

ట్రాఫిక్ మళ్లింపు ...

ఐలూరుకు లక్షమంది భక్తులు వస్తారనే అంచనాతో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు తగిన చర్యలు చేపట్టారు. ఆరుచోట్ల పార్కింగ్ ప్రదేశాలను, 16 చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. విజయవాడ నుంచి కరకట్ట మీదుగా అవనిగడ్డ వెళ్లే బస్సులు, ఇతర వాహనాలను తోట్లవల్లూరు మీదుగా ఉయ్యూరు వైపు, అవనిగడ్డ నుంచి కరకట్ట మీదుగా విజయవాడ వెళ్లే వాహనాలను లంకపల్లి నుంచి పమిడిముక్కల మీదుగా మంటాడ వైపు మళ్లించే విధంగా చర్యలు తీసుకున్నారు. సీఐ వై చిట్టిబాబు, ఎస్సై సీహెచ్ అవినాష్ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



ఐలూరు రామేశ్వరస్వామి దేవస్థానం, కృష్ణ నదీపాయలో జల్లు స్నానాలకు ఏర్పాట్లు



నిడుమోలు గ్రామంలో పారిశుధ్యంపై గ్రామస్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

స్వచ్ఛ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి
కలెక్టర్ డీకే బాలాజీ

కూచిపూడి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ గ్రామాల అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మొవ్వ మండలంలోని నిడుమోలు గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడుతూ తడి, పొడి చెత్తను ఇళ్ల వద్దే వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. ఇలా వేరు చేసిన వ్యర్థాలతో సంపద సృష్టించటానికి ఆస్కారం ఏర్పడుతుందన్నారు. తడి చెత్తతో పెరట్లోనే హోం కంపోస్టు ఎవరికి వారు ఇళ్ల వద్దనే తయారు చేసుకోవాలని సూచించారు. మురుగు కాల్వల్లో చెత్తాచెదారాలు వేయకూడదన్నారు. అధికారులతోపాటు ప్రజలు శానిటేషన్‌పై అవగాహన పెంపొందించుకుని పరిశుభ్రమైన గ్రామాలు, పట్టణాలు, జిల్లాలుగా రూపొందించుకునేందుకు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో చర్చించి అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు.

కరాటేలో షైనింగ్ స్టార్ విద్యార్థుల ప్రతిభ



విజేతలతో కళాశాల యాజమాన్యం

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గుడివాడ మండలం షైనింగ్ స్టార్ విద్యార్థులు కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చారు. శ్రీరామవేంద్ర నగర్‌లో ఉన్న శ్రీ సాయి షైనింగ్ స్టార్ పాఠశాల విద్యార్థులు శ్రీ జవహర్ లాల్ నెహ్రూ మెమోరియల్ ఆల్‌ఇండియా కరాటే డూ చాంపియన్ షిప్ 2025 పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. కళాశాల యాజమాన్యం లింగమనేని స్రవంతి, లింగమనేని జగదీష్‌లు విద్యార్థులను, కోచ్ రామకృష్ణను అభినందించారు.



మద్యం దుకాణాలకు సీల్

పామర్రు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27న జరగనున్న కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘ ఆదేశాలకు అనుగుణంగా 48గంటలు మద్యం అమ్మకాలను నిలుపుదల చేస్తున్నట్లు గుడివాడ ఎక్సైజ్ ఎస్సై సుస్మిత ప్రకటించారు. దానిలో బాగంగా మంగళవారం పామర్రు పరిధిలోని అన్ని మద్యం దుకాణాలకు సాయంత్రం తన సిబ్బందితో చేరుకుని తాళాలకు సీల్ వేసి వాటికీలను స్వాధీనం చేసుకున్నారు. పామర్రు పరిధిలోని మద్యం దుకాణాలు రెండు రోజులపాటు మూసి ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని ఆరు మద్యం దుకాణాలను మంగళవారం సాయంత్రం 4గంటల నుంచే మూసివేసి సీల్ వేశారు. ఇక గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎం హైస్కూల్‌లోని ఎన్నికల కేంద్రం వద్ద బారికేడ్లను వీఆర్వోలే స్వయంగా ఏర్పాటు చేశారు. గదులను పరిశుభ్రపరచడం, అభ్యర్థుల లిస్టులను తయారుచేసి ప్రచురించే పనులను వేగతరం చేశారు.



గుడ్లవల్లేరులో పోలింగ్ కేంద్రం వద్ద రెవెన్యూ సిబ్బంది ఏర్పాట్లు

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం



ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం



పామర్రులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రవికాంత్

గుడివాడ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్డీవో జి.బాల సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరుగుతుందన్నారు. డివిజన్ పరిధిలోని ఏడు మండలాల్లో 18,440 మంది పట్టభద్రుల ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మండల కేంద్రాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పట్టభద్రులకు ఇబ్బందులు తలెత్తకుండా పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతోపాటు ప్రతికేంద్రంలో వైద్య శిబిరం, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో తెలిపారు.

పెదపారుపూడి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు తహసీల్దార్ వై.రంగారావు తెలిపారు. మంగళవారం పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించి రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టామని తహసీల్దార్ తెలిపారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

పామర్రు: పట్టభద్రుల, ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పామర్రు కంచర్ల రామారావు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన 162, 163 పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ జి.రవికాంత్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో వెబ్ కెమెరాల ఏర్పాటుకు అవసరమైన సూచనలు చేశారు. ఓటర్లకు అవసరమైన తాగునీరు, షామియానాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మండలంలోని మొత్తం 1766మంది ఓటర్లు తమ ఓటు హక్కు రెండు బూత్‌ల్లో వినియోగించుకునే విధంగా అవసరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఎరాము, వీఆర్వో పూర్ణచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బూత్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి
పామర్రు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు విజయకుమార్

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో కూటమి పార్టీ తరపున పాల్గొనే బూత్ ఏజెంట్లు పూర్తి అప్రమత్తతో వ్యవహరించాలని పామర్రు నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు, బయోడైవర్సిటీ చైర్మన్ నీలాయపాలెం విజయకుమార్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని తొమ్మిది పోలింగ్ కేంద్రాల బూత్ ఏజెంట్లకు ఎన్నికల నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. పోలింగ్ రోజున ప్రత్యర్థి పార్టీల నుంచి దొంగ ఓట్ల నివారణకు బూత్‌లో అనుసరించవలసిన విధి విధానాలను వివరించారు. కార్యక్రమంలో దేశం మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, వల్లూరిపల్లి గణేష్, వర్ల చాణిక్య, మండపాక శంకర్‌బాబు, చైతన్య, పానుగంటి సందీప్, జనసేన ఎంపీటీసీ కూనపరెడ్డి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్ కృష్ణవేణి

సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై శిక్షణ

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై గుడ్లవల్లేరు, నందివాడ, గుడివాడ మండలాల పంచాయతీ కార్యదర్శులు, క్లాప్‌మిత్ర, షెడ్ మిత్రలకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని గుడ్లవల్లేరు పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. తడి, పొడి చెత్త సేకరణపై గృహస్తులకు రిసోర్స్ పర్సన్లు అవగాహన కల్పించారు. సేకరించిన వాటిని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ల వద్ద ఏవిధంగా ప్రాసెస్ చేసి సంపదగా మార్చుకోవాలనే విషయాలను వివరించారు. కార్యక్రమంలో గుడివాడ డివిజనల్ పంచాయతీరాజ్ అధికారిణి డి.సంపత్‌కుమారి, రిసోర్స్‌పర్సన్ కమలాకర్, ఎంపీడీవో టి.విజయసారథి, నందివాడ ఈవోఆర్డీ బాష్, గుడివాడ ఎంపీడీవో విష్ణు, ఈవోఆర్డీ శ్రీనివాస్, పంచాయతీ సెక్రటరీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



ముగిసిన జ్ఞానజ్యోతి శిక్షణ

పెదపారుపూడి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమాలు మంగళవారంతో ముగిశాయి. డీఆర్పీలు శివశంకర్, శ్రీదేవి, నాగజ్యోతి, అరుణ కుమారి, శివ నాగమణిలు అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణలో భాగంగా ప్రీ స్కూల్ పిల్లల అన్ని రకాల అభివృద్ధిలను పరిశీలించి ప్రతీ మూడు నెలలకు ఒకసారి అసెస్‌మెంట్ కార్డు ఎలా పూర్తి చేయాలో వివరించారు. కార్యకర్తలందరూ ట్రైనింగ్‌లో నేర్చుకున్న విషయాలను అంగన్‌వాడీ కేంద్రంలో అమలయ్యేలా చూడాలని ఎంఈవో-2 సురేష్ అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం భవాని, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు విశిష్ట సంక్షేమ సంఖ్య నమోదు చేసుకోవాలి
జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ జ్యోతిరమణి

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రైతు విశిష్ట సంక్షేమ సంఖ్యను నమోదు చేసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ కె.జ్యోతిరమణి అన్నారు. మంగళవారం గుడివాడ రూరల్ మండలం బిళ్లపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. మండలంలో రైతు విశిష్ట సంఖ్య 3004 మంది రైతులు మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, మిగిలిన రైతులు రైతు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలని కోరారు. రైతులు ఎక్కడ ఉన్నా రైతు సేవా కేంద్రంలో ఫోన్ ద్వారా సంప్రదించి వివరాలు తెలుసుకుని నమోదు చేసుకోవాలన్నారు. ఈ విషయంపై రైతులు ఏలాంటి అపోహలు పడవద్దని తెలిపారు. ప్రతీ రైతు నమోదు చేసుకుని ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, రాయితీలు పొందాలని తెలిపారు. వచ్చే ఖరీఫ్ నాటికి సబ్సిడీలు, రాయితీలు విశిష్ట సంఖ్య నమోదు చేసుకున్న వారికే లభిస్తాయన్నారు. ఏడీఏ శ్రీనివాసరావు, గుడివాడ ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి, ఏవోలు బోలెం అనంతలక్ష్మి, పద్మజ, ఏఈవో డి.అనూష, రైతులు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

గుడివాడ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఎంచుకున్న లక్ష్యాన్ని చేరాలంటే శ్రమతో కూడిన పట్టుదల అవసరమని టూటౌన్ సీఐ సీహెచ్ నాగప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక శ్రీనిధి కోచింగ్ సెంటర్‌లో డీఎస్సీకి సిద్ధమవుతన్న అభ్యర్థులకు శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో డీఎస్సీ పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కోచింగ్ సెంటర్ నిర్వాహకులు జాజుల మునీంద్ర, సుమ, నార్ని వెంకట రామారావు, యాదవ సేవాసంఘం సభ్యులు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న టూటౌన్ సీఐ నాగప్రసాద్